మానేరు **జనత**
తెలుగు దినపత్రిక — ఇది జనం గొంతుక

15.09.2024 ఆదివారం sunday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 156 | పేజీలు : 8 Pages : 8 | వెల: 5
Published from : Rangareddy, Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad,

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## తిలక్ సెంచరీ
పట్టుబిగించిన ఇండియా 'ఎ'



4

# అది ఫ్యాక్షన్ తరహా దాడి

## ఫ్యాక్షన్ తరహాలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి



- పదేళ్లలో ప్రాంతీయ విభేదాలపై ఒక్క సంఘటన లేదు..
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందే..
- దాడులకు భయపడేది లేదు..కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడతాం
- బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్యే కౌశిక్ ఇంటిని సందర్శించిన కేటీఆర్



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో గుండాలతో.. వాహనాలపై వచ్చి ఫ్యాక్షన్ తరహాలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాసంపై దాడి చేసారని, ఇందుకు పోలీసు అధికారులు కూడా వత్తాసు పలికారని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ కొండాపూర్ లోని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాసానికి శనివారం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు.

హుజురాబాద్, సెప్టెంబర్ 14 జనతా న్యూస్: : రెండు రోజుల క్రితం కౌశిక్ నివాసంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తో పాటు అయన అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్బంగా కేటీఆర్ కు కౌశిక్ స్వాగతం పలికారు. కౌశిక్ తో పాటు అయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం



## శ్రీజ డెయిరీతో హరీష్‌రావు అక్రమాలు

మదర్ డెయిరీ విజేతలకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

.. వివరాలు 3లో



## భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు

కాల్వలకు గండ్లతో భారీగా నష్టం

కేంద్రానికి నివేదిక అందించాలన్న ఉత్తమ్

.. వివరాలు 3లో



రానున్న పదేళ్లు ప్రజల కోసమే

# పనిచేస్తాం..

- లోక్‌సభలోవిద్వేషం పంచే, పెంచేవాళ్లే ఎక్కువ
- పేదల గొంతుకను వినిపించేవాళ్లు తక్కువ
- దేశాన్ని కాపాడేవారే ఎన్నికల్లో గెలవాలి
- కాంగ్రెసకు వ్యతిరేకంగా ఒవైసీ మాట్లాడితే
- శత్రువుగా చూడలేం:సీఎం
- 'ప్రొఫెట్ ఆఫ్ ది వరల్డ్' పుస్తకావిష్కరణ

లోక్‌సభలో ప్రజల గొంతుకను వినిపించేవాళ్లు తక్కువగా ఉన్నారని, విద్వేషం పెంచి, పంచేవాళ్లు ఎక్కువగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రజల తరపున మాట్లాడేందుకు గతంలో జైపాల్‌రెడ్డి వంటి గొప్ప నేతలు ఉండేవారని.. ఇవాళ.. కార్పొరెట్, వ్యాపార దృక్పథం ఉన్నవారు రాజకీయాల్లోకొస్తున్నారన్నారని... అలాంటివారి వారుంటే వారి వ్యాపారం పెరుగుతుంది తప్ప.. పేద వర్గాల గొంతుకగా వాళ్లు పనిచేయలేరని' ఆక్షేపించారు.

జనతా న్యూస్: హైదరాబాద్, సెప్టెంబరు 14 : దేశాన్ని కాపాడేవారే ఎన్నికల్లో గెలవాలన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇస్లామిక్ సైన్స్ పరిశోధన సంస్థకు చెందిన 'అల్ మహదుల్ ఆలీ అల్ ఇస్లామీ' ఆధ్వర్యంలో 'ప్రొఫెట్ ఫర్ ది వరల్డ్' పుస్తకావిష్కరణకు రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పుస్కకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు.
లోక్‌సభలో ముస్లింలు, దళితులు, ఆదివాసీల గురించి అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతుంటే సంతోషంగా అనిపించేదని.. ఒక్కోసారి కాంగ్రెసకు వ్యతిరేకంగా మాట్లాడినా సంతోషం కలిగేదని, బాధ మాత్రం

మిగతా 2 లో



ఎమ్మెల్యేలు బజారున పడి

# తన్నుకోవడం దారుణం

- శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం
- సిఎల్పీని విలీనం చేసుకుని విపక్షం లేకుండా చేసిన ఘనులు
- ప్రతిపక్షం అంటే గౌరవం ఉందన్న డిప్యూటి సిఎం భట్టి

వివరాలు 3 లో

# కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు

## ఇంతకాలం విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయి

- అప్రకటిత కర్ఫ్యూల కాలం ముగిసింది
- వారసత్వ రాజకీయాలు కాశ్మీర్‌ను దెబ్బతీసాయి
- కొత్త నాయకత్వంతోనే కాశ్మీర్ అభివృద్ధి
- హర్యానాలో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలోకి దిగారు. కాశ్మీర్, హర్యానా ఎన్నికల్లో ప్రచారం చేపట్టారు. తొలిసారి దోడా జిల్లాలో పర్యటించారు. కాశ్మీర్‌లో శాంతిస్థాపనకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ ఎన్నికలు జమ్మూకశ్మీర్ భవిష్యత్తును నిర్ణయించచనున్నాయని ప్రధాని మోదీ అన్నారు.

చండీఘడ్/శ్రీనగర్,సెప్టెంబర్14 :స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మన జమ్మూకశ్మీర్‌ను విదేశీ శక్తులు లక్ష్యంగా చేసుకున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా వారసత్వ

మిగతా 2 లో





3

వ్యవసాయ శాఖ సలహాదారుగా

## పోచారం బాధ్యతలు

అభినందించిన మంత్రి పొన్నం తదితరులు

# సీతారాం ఏచూరి తుదివీడ్కోలు

## ఎయిమ్స్ పరిశోధనలకు భౌతిక కాయం అప్పగింత




జనతా న్యూస్ న్యూఢిల్లీ,సెప్టెంబర్14 : కామ్రేడ్ సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులు వైద్య పరిశోధన కోసం ఆయన భౌతికకాయాన్ని దానం చేశారు. దీనికి సంబంధించిన పత్రాలపై వారు సంతకం చేసి, సీతారాం భౌతిక కాయాన్ని ఎయిమ్స్ హాస్పిటల్ కు అప్పగించారు. కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి భౌతికకాయం తిరిగి ఎయిమ్స్ కి చేరుకున్నది. ఎయిమ్స్ వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు సీతారాం ఏచూరికి ఆఖరి సల్యూట్ చేసి కన్నీటి వీడ్కోలు పలికారు. కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని శనివారం ఉదయం 11 గంటలకు ప్రజల

మిగతా 2 లో



## హైడ్రా ముమ్మాటికీ చట్టబద్ద సంస్థనే



- టాస్క్‌ఫోర్స్ తరహాలో అధికారాలు
- త్వరలోనే ఆర్డినెన్స్ కూడా రాబోతోంది
- కమిషనర్ రంగనాథ్ వెల్లడి

జనతా న్యూస్: హైదరాబాద్, హైడ్రా చట్టబద్ధతపై కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇది చట్టబద్ధమైనదే. జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కార్యనిర్వాహక తీర్మానం ద్వారానే ఏర్పాటు చేశారు. దీనికి చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ నెల లోపు ఆర్డినెన్స్ రానుంది. విశేష అధికారాలు కూడా రాబోతున్నాయి. 6 వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లు వస్తుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు సహకారం అందిస్తాం. గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్

మిగతా 2 లో

జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 15 సెప్టెంబర్ 2024


# ప్రజలను పగబట్టిన సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ కౌశిక్ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కౌశిక్ రెడ్డిని ఇంటినుండి బయటకు వెళ్లనివ్వకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి.. ఎమ్మెల్యే గాంధీ గుండాలతో.. రౌడీలతో కాన్వాయ్ తో వస్తుంటే... పోలీసు అధికారులు సహకరించారని మండిపడ్డారు. కౌశిక్ నివాసంలో కుటుంబ సభ్యులు, పెద్దలు ఉన్న రూమ్ పై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసారని వారికి ఏమైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఇలాంటి దాడుల సంస్కృతీ ఏనాడూ లేదు అని అయన అన్నారు. హైదరాబాద్ లో ఇలాంటి హింసాయుత పద్ధతులు ఏనాడూ చూడలేదని, చేతగాని ముఖ్యమంత్రి తో ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని, సి ఎం పదవిని రేవంత్ అనర్హుడని కేటీఆర్ మండిపడ్డారు. కౌశిక్ ఇంటిపై దాడి సమయంలో ఎమ్మెల్యే గాంధీ సంయమనం కోల్పోయారని, బజారు, చిల్లర భాష మాట్లాడారని మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో రూ. 9500 కోట్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని కేసీఆర్ కేటీఆర్ అభివృద్ధి చేసారంటూ.. గాంధీ ప్రచారం చేసుకున్న మాట వాస్తవం కదా? ఆ అభివృద్ధి ఎక్కడ పోయింది? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ దాడులకు భయపడేది లేదని, ఆరు గ్యారెంటీలపై పట్టు బడతామని, ప్రజలకోసం పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేసారు. దాడి చేసిన గుండాలు, పోలీసులను ఎవరిని వదిలిపెట్టమని, ఈ ఘటనకు బాధ్యులైన ఎమ్మెల్యే గాంధీతో పాటు అయన అనుచరులు, గుండాలపై కేసులు నమోదు చేయాలనీ, ఏసిపి, డిసిపి తదితరులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేసారు. దాడి తదనంతరం వచ్చిన హరీష్ రావు.. ఇతర నేతలను పోలీసులు అరెస్ట్ చేసి వేరే చోటికి తరలించారని, సీఎం సొంత జిల్లాలోనే వేలాది మంది రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారని, ప్రభుత్వానికి ఎదురు తిరిగి పాలమూరు పౌరుషం చూపారని అయన అన్నారు. ఒక్క గాంధీని హౌజ్ అరెస్ట్ చేస్తే సరిపోయేది, కానీ రాష్ట్ర వ్యాప్తంగా గులాబీ నేతలను, శ్రేణులను హౌస్ అరెస్ట్ చేసారని అయన విమర్శించారు. కౌశిక్ రెడ్డికి సంఘీభావం తెలిపేందుకే ఇక్కడకు వచ్చామని, ఇక ముందుకు కూడా పార్టీ నేతలపై ఎక్కడ ఇలాంటి సంఘటనలు జరిగినా పార్టీ, తామంతా అండగా ఉంటామని అయన భరోసా ఇచ్చారు.

### గాంధీ మాటలు హాస్యాస్పదం

"పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ఉరితీయాలి.. చావు దప్పు కొట్టాలి.. రాళ్లతో కొట్టి చంపాలి" అని రేవంత్ గతంలో చెప్పారని గుర్తు చేసారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని నుండి హైకోర్టు తీర్పు వచ్చిన రోజే స్పీకర్ కార్యాలయం బి ఏ సి చైర్మన్ గా గాంధీని నియమిస్తూ.. ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హమని కేటీఆర్ విమర్శించారు. హైకోర్టు తీర్పు వచ్చిన రోజే పార్టీ మారిన గాంధీ కొత్తరాగం అందుకున్నారని, కాంగ్రెస్ లో చేరిన అయన తాను పార్టీ మారలేదని, బి ఆర్ ఎస్ లోనే ఉన్నానని చెప్పడం హాస్యాస్పదమని కేటీఆర్ ఎద్దేవా చేసారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకొని పక్షంలో సుమోటోగా కేసు తీసుకుంటామని హైకోర్టు ప్రకటించిన నేపథ్యంలో ఆ తీర్పును గౌరవిస్తూ.. ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేయాలని, ప్రజాక్షేత్రం లోకి రావాలని కౌశిక్ డిమాండ్ చేసారని, ఇందులో తప్పేమి ఉందని కేటీఆర్ ప్రశ్నించారు.

### ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్నది కాంగ్రెస్ పార్టీనే..

కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ విభేదాలు రెచ్చగొడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ లో ఆంధ్ర తెలంగాణ పంచాయతీ ఏనాడూ లేదని, అందుకు పదేళ్ల కేసీఆర్ పాలనే సాక్ష్యమని, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేశామని ఆయన గుర్తు చేసారు. ప్రాంతీయ ద్వేషం, ప్రాంతీయ తత్వం ఏనాడూ ఇక్కడ లేదు.. ఏనాడూ ఒక్క చిన్న ఘటన కూడా జరగలేదు.. ఇక ముందు కూడా ఉండదు అని అయన అన్నారు. పదేళ్లు హైదరాబాద్ ప్రశాంతంగా ఉంది. అందుకే ప్రజలు కడుపునిండా ఆశీర్వదించి హైదరాబాద్ లో మా ఎమ్మెల్యేలను గెలిపించారు అని అయన అన్నారు.



### హైడ్రా పేరుతో పగబట్టారు

హైడ్రా పేరుతో సి ఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ప్రజలను పగబట్టారని, అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ లో సీట్లు ఇవ్వలేదని కక్ష్య తీర్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడతామని కేటీఆర్ హెచ్చరించారు. ఎమ్మెల్యేల ఇంటికి గూండాలను పంపించే స్థితికి సి ఎం దిగజారారని, ఇలాంటి సి ఎం లను చాలా మందిని చూశామని, చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ లాంటి వారు కూడా నిలబడలేక పోయారని అయన అన్నారు. నువ్వొక చిట్టినాయుడు.. బుల్లెబ్బాయ్.. సి ఎం లను చాలా మందిని చూసాం.. పైశాచిక ఆనందం కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నావ్.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. ఇది దుష్ట సంప్రదాయం.. ఇది నీకే చుట్టుకుంటుంది అని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసిన బి ఆర్ ఎస్ వదిలిపెట్టదని, రాష్ట్రంలో పేద ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని అయన హెచ్చరించారు.

## రానున్న పదేళ్లు ప్రజల కోసమే పనిచేస్తాం..

మొదటి పేజీ తరువాయి

పడలేదని, తమకు వ్యతిరేకంగా చెబితే శత్రువులుగా చూడబోమన్నారు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు 17 మంది ప్రాతినిధ్యం వహిస్తుండగా వారిలో పేదల గురించి మాట్లాడేవారిలో అసదుద్దీన్ ఒవైసీ కూడా ఒకరని.. ఆయన తమవెంట ఉన్నారా? లేదా? అనేది తాము చూసుకోబోం అని.. హైదరాబాద్‌లో ఉన్న 4 కోట్ల ప్రజల అభివృద్ధి కోసం కృషిచేస్తామన్నారు. అందుకు విరుద్ధంగా ఉంటే హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. మహమ్మద్ ప్రవక్త దారిలో నడిచి దేశాన్ని కాపాడుకోవాలని.. ఆ దారిలో నడిస్తే రానున్న కాలంలో మంచిరోజులొస్తాయన్నారు. మహమ్మద్ ప్రవక్త చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యంతో ముందుకు నడవాలన్నారు. హైదరాబాద్ నుంచే ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు ఉండటం సంతోషం కలిగించిందన్నారు. ఎన్నికల్లో గెలవడానికే విద్వేషాన్ని పెంచడంలో తప్పులేదని.. అయితే. గెలిచిన తర్వాత ప్రజల మధ్య చిచ్చు పెట్టి, అంతరాలు పెంచేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండేసి సార్లు చంద్రబాబును, వైఎసను.. తెలంగాణ ఏర్పడ్డాకా రెండుసార్లు కేసీఆర్‌ను గెలిపించారని... రానున్న పదేళ్లలో తాము కూడా పేదవర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తామని ప్రకటించారు.

ఈసా-మూసీ నదులు దెబ్బతిని... మురుగు అంతా మూసీలో కలుస్తోందని... అందుకే మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంబడి నివాసం ఉంటున్న పేద ప్రజల లెక్కలు తీస్తున్నామని.. వీరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామన్నారు. భగవద్గీత, బైబిల్, ఖురాన్ చెప్పేదొక్కటేనని.. అందరం కలిసికట్టుగా ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే బాధ్యతగా ఉండాలన్నారు. ఈ దేశంలో కొందరు ద్వేషాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని మనమంతా గుర్తించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు(మైనారిటీ వ్యవహారాలు) మహ్మద్ అలీ షబ్బీర్, తెలంగాణ మైనార్టీ విద్యాలయాల సంస్థ డైరెక్టర్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి తుదివీడ్కోలు

మొదటి పేజీ తరువాయి

సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసం నుండి మూడు దశాబ్దాలుగా పని చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్‌కు తరలించారు. దివంగత నేతకు నివాళులు అర్పించేందుకు కుటుంబ సభ్యులు, సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు, పార్టీ శ్రేణులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, మేధావులు, వివిధ వర్గ, సంఘాల నాయకులు, ప్రజా ఉద్యమాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎకెజి భవన్‌కు చేరుకొని సీతారాంకు నివాళులర్పించేందుకు తరలివచ్చారు. ప్రముఖ చరిత్రకారిణి ప్రొఫెసర్ రొమిల్లా థాపర్, కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్, అజయ్ మాకెన్, రాజీవ్ శుక్లా తదితరులు నివాళు లర్పించారు. ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు శరద్ పవార్ ఏకేజీ భవన్‌కు వచ్చి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, అస్సాం, బీహార్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీల సిపిఎం నేతలు సీతారాం ఏచూరి భౌతికకాయానికి నివాళులర్పించారు. ధ్యాహ్నం 3 గంటలకు ఎకెజి భవన్ నుంచి ఎయిమ్స్ వరకు అంతిమ యాత్ర సాగుతుంది. అనంతరం ఆయన కోరుకున్న విధంగా భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు కుటుంబ సభ్యులు అప్పగించారు. యిమ్స్ నుంచి జెఎన్‌యుకు తీసుకొచ్చి స్టూడెంట్స్ యూనియన్ హాలులో శుక్రవారం సాయంత్రం ఉంచారు. సాయంత్రం 4 గంటల వరకు జెఎన్‌యులో నివాళులర్పించే కార్యక్రమం కొనసాగింది. ఆ తరువాత ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సందర్శనార్థం వసంత్ కుంజ్‌లోని నివాసానికి తరలించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని విరాళంగా ఇవ్వడానికి ముందు పొలిట్ బ్యూరో సభ్యులు తుది వీడ్కోలు పలికారు.

## హైడ్రా ముమ్మాటికీ చట్టబద్ధ సంస్థనే

మొదటి పేజీ తరువాయి

తరహాలో హైడ్రా పనిచేస్తుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ లోపు ఆర్డినెన్స్ రాబోతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన విషయాన్ని వెల్లడించారు. చాలా మంది హైడ్రాపై అనేక అనుమానాలు లేవనెత్తున్నారని, కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారని.. అలాంటి వారికి త్వరలోనే సమాధానం దొరుకుతుందని రంగనాథ్ చెప్పుకొచ్చారు. తెలంగాణ క్యాబినెట్ ఆమోదంతో హైడ్రాకు విశేషాధికారాలు కల్పిస్తూ ఆర్డినెన్స్ రాబోతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సమావేశంలో కమిషనర్ రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ..' తెలంగాణ ప్రభుత్వం జులై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. హైడ్రాకు చట్టబద్ధత ఉందా, లేదా? అని ఇవాళ కొంతమంది ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొంత మంది న్యాయస్థానాలకు సైతం వెళ్లారు. హైడ్రా చట్టబద్ధమైనదే. ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారా దీన్ని ఏర్పాటు చేశారు. ప్లానింగ్ కమిషన్, క్యాబినెట్ సెక్రటేరియెట్, లా కమిషన్, ఏసీబీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటివి ఎన్నో ఎగ్జిక్యూటివ్ రెజల్యూషన్ ద్వారానే ఏర్పాటయ్యాయి. అక్టోబర్ లోపు హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురాబోతుంది. హైడ్రాను చట్టబద్ధం చేసేందుకు తెలంగాణ సర్కార్ పని చేస్తుంది. త్వరలో క్యాబినెట్ ఆమోదంతో దీనికి విశేషాధికారాలు రానున్నాయి. వాల్టా, మున్సిపల్, జీహెచ్ఎంసీ, నీటిపారుదల చట్టాల్లోని విశేషాధికారాలు సైతం హైడ్రాకు వస్తాయి. ఆరు వారాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో హైడ్రా బిల్లు తీసుకురాబోతుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు హైడ్రా సహకారంగా ఉంటుంది. గ్రే హౌండ్స్, టాస్క్ ఫోర్స్ తరహాలోనే హైడ్రా పని చేస్తుందని చెప్పారు.

## ముగింపు దశకు వినాయక చవితి ఉత్సవాలు

### గంగ ఒడికి సిద్ధం అవుతున్న గణపయ్య



హైదరాబాద్,సెప్టెంబర్ 14 : వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నిమజ్జ
నంతో ఈ యేడు ఉత్సవాలు ముగుస్తాయి. తొమ్మిది రోజుల పాటు పూజలను అందుకున్న గణపయ్య పదో రోజైన అనంత చతుర్దశి రోజున నిమజ్జనంతో గంగమ్మ ఒడిలోకి చేరతాడు. అనంత చతుర్దశి రోజున ప్రజలు గణపతి విగ్రహాన్ని ఎంతో వైభవంగా, సంగీత వాయిద్యాలతో ఊరేగిస్తూ నది దగ్గరకు తీసుకుని వెళ్లి నిమజ్జనం చేస్తారు. అనంతచతుర్దశి కూడా మనకు ఎంతో ప్రముఖమైన రోజు. ఈ రోజున అనంతపద్మనాభ వ్రతం చేస్తారు. ఈ క్రమంలో తెలంగాణలో 17న మంగళవారం నిమజ్జనం జరుగనుంది. గణపతి బప్ప మళ్లీ ఏడాది తమ ఇంటికి తీసుకుని రావాలని ప్రార్థిస్తారు. గణెళిష్ ఉత్సవం భాద్రపద మాసంలోని శుక్ల పక్ష చతుర్థి తిథిన ప్రారంభమవుతుంది. ఈ పండుగ భాద్రపద మాసంలోని శుక్ల పక్షం చతుర్దశి తేదీ వరకు కొనసాగు తుంది.ఈ 10 రోజులు వినాయకుడు ఇళ్ళలో, పూజా మండపాలలో కొలువుదీరి పూజలను అందుకుంటాడు. వేద క్యాలెండర్ ప్రకారం అనంత చతుర్దశి తిథి 16 సెప్టెంబర్ మధ్యాహ్నం 03:10 గంటలకు ప్రారంభమవుతుంది. అనంత చతుర్దశి రోజున ఉదయం 6.20 గంటల నుండి 11.44 గంటల వరకు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి ఉదయం 9.23 నుంచి సాయంత్రం 9.28 వరకు శుభ సమయం. ఈ శుభ సమయంలో గజాననుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుందని నమ్మకం.గణెళిశుడిని నిమజ్జనం చేయడానికి ముందుగా చెక్క ఆసనాన్ని సిద్ధం చేయండి. దానిపై స్వస్తిక్ గుర్తుని వేసి గంగాజలంతో శుద్ధి చేయండి. పసుపు రంగు వస్త్రాన్ని పరచి దానిపై వినాయక విగ్రహాన్ని ఉంచి.. కొత్త బట్టలు వేసి పసుపు, కుంకుమ అంద్దండి. అనంతరం ఆసనంపై అక్షతలు వేసి గణపతి విగ్రహానికి పూలు, పండ్లు, మోదకం మొదలైన వాటిని సమర్పించండి. బప్పా విగ్రహాన్ని నిమజ్జనం చేసే ముందు పూర్తి నియమ నిబంధలనతో పూజించండి. గణపతి తిరిగి తమ ఇంటికి మళ్ళీ తిరిగి రమ్మనమని ప్రార్థించండి. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి హారతి ఇవ్వండి. ఆ తరువాత గణెళిశ విగ్రహాన్ని ఆచారబద్ధంగా నిమజ్జనం చేయండి. పుజాదికార్యక్రమాల సమయంలో ఏమైనా తెలిసి తెలియక తప్పులు చేస్తే క్షమించమని గణపయ్యను అడగండి. వచ్చే ఏడాది మళ్లీ ఇంటికి రమ్మనమని ప్రార్థించడం ద్వారా ఉత్సవాలు ముగుస్తాయి.

## కాశ్మీర్ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు



మొదటి పేజీ తరువాయి

రాజకీయాలను వ్యతిరేకించారు. ఆ తరహా పార్టీలు ఈ ప్రాంతంలో అభివృద్ధిని దెబ్బతీశాయని విమర్శించారు. ఇకముందు అప్రకటిత కర్ఫ్యూలు ఉండవని, ఆరోజులు మ-ుగిశాయని చెప్పారు. అలాగే భాజపా కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని పరివారవాదులు వంచన చేయడం ప్రారంభించారు. మీరు విశ్వసించిన రాజకీయపార్టీలు మీ పిల్లల భవిష్యత్తును పట్టించుకోలేదు. వారు వారి వారసుల భవిష్యత్తుపైనే దృష్టిసారించారు. జమ్మూకశ్మీర్ యువత ఉగ్రవాదంతో బాధపడింది. ఈ వారసత్వ పార్టీలు మిమ్మల్ని తప్పుదోవ పట్టించి, వేడుక చూశాయి.

2000 సంవత్సరం నుంచి ఇక్కడ పంచాయతీ ఎన్నికలు జరగలేదన్న సంగతి మీకు తెలిసిందే. కొత్త నేతలకు అవకాశం ఇవ్వలేదు. అందుకే కొత్తనాయకత్వాన్ని మీ ముందుకు తీసుకురావాలని ప్రయత్నించాను. తర్వాత వం-ుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి చేర్చడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యం. ఈ ప్రాంతంలో అప్రకటిత కర్ఫ్యూలు ఉండేవని మీకు తెలుసు. లాల్‌చౌక్ వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. కాంగ్రెస్ హయాంలో కేంద్రంలో హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ రోజులు ముగిశాయి అని మోదీ మాట్లాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వెల్లడించారు. పలు హామీలను ప్రకటించారు. ఇదిలా ఉంటే.. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ లో మరో నాలుగు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ప్రారంభం కానున్న తరుణంలో.. వరుసగా ఉగ్రదాడులు, ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కిష్త్వాడ్, ఉధంపుర్, పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో యాంటీ టెర్రర్ ఆపరేషన్లను మరింత పెంచినట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ ప్రాంతాల్లో వరుసగా రెండోరోజు గాలింపుచర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నాయి. గత 42 ఏళ్లలో భారత ప్రధాని ఈ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ జరగనుంది. చీనాబ్ లోయలోని కిష్త్వాడ్, రాంబన్, దోడాతో పాటు దక్షిణ కశ్మీర్ జిల్లాల్లోని మొత్తం 24 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇదిలావుంటే కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రజాసేవ చేసేందుకు తనను ఆశీర్వదించిన ప్రజలు హర్యానాలోనూ బీజేపీకి 'హ్యాట్రిక్' విజయాన్ని అందించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. హర్యానా ప్రజల ఉత్సాహాన్ని చూస్తే బీజేపీని తిరిగి గెలిపించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్టు చెప్పగలనని అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కురుక్షేత్రలో జరిగిన ర్యాలీలో మోదీ శనివారంనాడు పాల్గొని ప్రసంగించారు.

రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ది చేకూర్చేందుకు కేంద్రం ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపై రైతులు, పేదలు, యువకులు, మహిళలకు లబ్ది చేకూర్చేందుకు భారీ నిర్ణయాలు తీసుకుంటామని నేను వాగ్దానం చేశాను. ఇంకా 100 రోజులు కూడా పూర్తికాకుండానే రూ.15 లక్షల కోట్ల పథకాలను మా ప్రభుత్వం ప్రారంభించింది. పేద కుటుంబాలకు 3 లక్షల పక్కా గృహాలకు ఆమోదం తెలిపాం' అని మోదీ తెలిపారు. హర్యానాలో బీజేపీ ప్రభుత్వం పనితీరుతో పొరుగున ఉన్న హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ సర్కార్‌తో మోదీ పోల్చారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేసిందన్నారు. ఫలితంగా వేతనాల కోసం ప్రభుత్వ ఉద్యోగులు నిరసలకు దిగుతున్నారని అన్నారు. కాగా, హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.



## దేశవ్యాప్తంగా భారీ వర్షాలు

### విస్తరిస్తున్న నైరుతి పవనాలు...ఉత్తరాదిలో పలుచోట్ల భారీ వర్షాలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 14 : దేశంలో నైరుతి రుతుపవనాలు పర్వతాల నుంచి మైదానాల వరకు విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలోనే అనేక చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నేడు, రేపు కూడా పలు రాష్టాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని గంగా తీరాలలో సెప్టెంబర్ 15 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్ రిపోర్ట్ తెలిపింది. ఇది కాకుండా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్ అన్ని ఈశాన్య రాష్ట్రాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు మిజోరాం, త్రిపుర, అసోం, మేఘాలయ, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ ప్రాంతాల్లో సెప్టెంబరు 14, 15 తేదీల్లో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని కత్రాలోని త్రికూట పర్వతంపై రోజంతా పొగమంచు కారణంగా మా వైష్ణో దేవి వద్దకు హెలికాప్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయినప్పటికీ, బ్యాటరీ కార్, రోప్‌వే సేవలు కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని కొలుస్తూ భవనం వైపు బయలుదేరారు. జ్యోతిర్మఠం-మలారి రహదారిని మూసివేయడంతో 47 మంది వ్యక్తులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. పార్థదీప్‌లో కొండచరియలు విరిగిపడటంతో బద్రీనాథ్ హైవే శుక్రవారం రోజంతా మూసివేయబడింది. సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో శనివారం వరదలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సిమ్లా హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే పశ్చిమ హిమాలయ రాష్టాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారులతో సహా 400కి పైగా రహదారులపై ట్రాఫిక్ నిలిచిపోయింది. బద్రీనాథ్ హైవే కూడా రోజంతా మూసివేయబడింది. కేదార్‌నాథ్ ఫుట్‌పాత్ రెండో రోజు కూడా తెరవలేదు. హిమాచల్‌లోని రెండు జిల్లాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం పెరిగింది. అదే సమయంలో మైదాన రాష్ట్రాల్లో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లు జలమయమై జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తరాఖండ్‌లోని కుమావోన్ ప్రాంతంలో వర్షాల కారణంగా పలు ఘటనల్లో ముగ్గురు మహిళలు సహా ఐదుగురు మరణించారు. ఈ మరణాలు లోహాఘాట్, పితోరాఘర్, అల్మోరా, హల్ద్వానీ, సితార్‌గంజ్‌లలో సంభవించాయి. రాష్ట్రంలోని 324 రహదారులు కూడా పర్వతాల నుంచి రాళ్లు, శిథిలాల కారణంగా వివిధ ప్రాంతాల్లో మూసుకు పోయాయి. వీటిలో 185 రోడ్లు కుమావోన్ ప్రాంతంలో ఉన్నాయి. పలు జిల్లాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. కార్బెట్ పార్క్‌లో సఫారీ కూడా నిలిపివేశారు.

# శ్రీజ డెయిరీతో హరీష్‌రావు అక్రమాలు

## మదర్ డెయిరీ విజేతలకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు



జనతా న్యూస్: నల్గొండ,సెప్టెంబర్14 : మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. శ్రీజ పాల ఉత్పత్తి కేంద్రం హరీష్‌రావు బినామీ అని.. ఆ పేరుతో ఆయన చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని ఆరోపించారు. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల మదర్ డైరీ ఎన్నికలు శనివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో గుడిపాటి మధుసూదన్ రెడ్డి మదర్ డైరీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా ఎంపికైన మధుసూదన్ రెడ్డికి, ఈ ఎన్నికలో గెలిచిన ఆరుగురు డైరెక్టర్‌లకు ఎన్నికల అధికారితో కలిసి సర్టిఫికెట్‌లను మంత్రి కోమటిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో 6కు 6 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు.. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అన్ని ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, హాస్పిటళ్లకు మదర్ డైరీ పాలు సరఫరా చేయాలని... ఆ రెండు జిల్లాల కలెక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మదర్ డైరీ పాలు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లను మంత్రి కోమటి రెడ్డి కోరారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి మదర్ డైరీ నుంచే లడ్డూల తయారీకి అవసరమయ్యే నెయ్యిని అందజేయాలని మంత్రి కొండా సురేఖకు తెలిపారు. దీంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో జారీ చేసిన పాత జీవోను వెంటనే రద్దు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. యాదగిరిగుట్ట, వేములవాడ దేవస్థానాలకు లడ్డూల తయారీకి మదర్ డైరీ నుంచి నెయ్యి తరలింపును వెంటనే ప్రారంభించాలని మంత్రి కొండా సూరేఖను కోరారు ఇలా చేయడం ద్వారా రూ. 60 కోట్ల అప్పులో ఉన్న మదర్ డైరీ అప్పును త్వరగా తీర్చే అవకాశం ఉందని అన్నారు. బర్లు, గోర్లలోనే కాకుండా పాల ఉత్పత్తిలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీ చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మదర్ డైరీ అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం బాధ్యతలు

### అభినందించిన మంత్రి పొన్నం తదితరులు





హైదరాబాద్,సెప్టెంబర్14 : తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్ ఉద్యానవన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.దేశానికి, రాష్ట్రాని రైతే వెన్నుముక... అలాంటి రైతు కష్టాలను తీర్చేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని పోచారం కోరారు. వ్యవసాయదారుడు దేశానికి అన్నం పెట్టేవాడని, ఆయనను సరిగ్గా చూసుకుంటే దేశ ప్రగతి సుభిక్షంగా ఉంటుందన్నారు. ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా.. రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా పథకాలు, ప్రాజెక్టులు పూర్తి వంటి వాటికి సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసిన అనుభవంతో సలహాలు ఇస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## ఒకేరోజు పలు కార్యక్రమాలు

### నిమజ్జనం సజావుగా సాగేలా చర్యలు

### పటిష బందోబస్తు ఏర్పాటు చేసామన్న సిపి

హైదరాబాద్,సెప్టెంబర్14 : వినాయక చవితి సందర్భంగా హైదరాబాద్‌లో గణపతి నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 25వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఒకేరోజు మూడు కార్యక్రమలు ఉన్నందున పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వినాయక నిమజ్జనం రోజే విమోజన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో బిజెపి సమావేశం, ఉదయం, పబ్లిక్ గార్డెన్స్‌లో సిఎం జెండావందనం ఉంటుందన్నారు. అలాగే పాతబస్తీలో మిలాద్ నబీ ఉరేగింపు ఉందని అన్నారు. దీంతో నిమజ్జనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నారు. గణెళిశ్ పండగ సందర్భంగా నగరవ్యాప్తంగా భారీఎత్తున స్వామివారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. చిన్నపెద్ద విగ్రహాలు కలిపి మొత్తం లక్షల్లో ఉండే అవకాశం ఉంది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గణెళిశ్ నిమజ్జనం సందర్భంగా ఘర్షణలు, ప్రాణనష్టం, ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర సీపీ సీవీ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. సిటీ నుంచి 15వేల మంది సిబ్బంది, బయట నుంచి మరో 10వేల ఫోర్స్ రంగంలోకి దిగి భద్రతను పర్యవేక్షిస్తారని ఆయన చెప్పారు. సెప్టెంబర్ 16, 17తేదీల్లో పెద్దఎత్తున నిమజ్జనాలు ఉండడంతో.. ఈ రెండు తేదీల్లో సుమారు 40గంటలపాటు 25వేల మంది పోలీసులు నగరాన్ని పహారా కాస్తారని వెల్లడించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ ఆనంద్ కోరారు.

# ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం దారుణం



### శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

### సిఎల్పీని విలీనం చేసుకుని విపక్షం లేకుండా చేసిన ఘనులు

### ప్రతిపక్షం అంటే గౌరవం ఉందన్న డిప్యూటి సిఎం భట్టి

### మేడారం గ్రామంలో సోలార్ పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక

### బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటే మాకేం సబంధం అన్న శ్రీధర్ బాబు

కరీంనగర్,సెప్టెంబర్14 : బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటన సందర్భంగా.. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారంపై స్పందించారు. ఎమ్మెల్యేలు రోడ్డెక్కి కొట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించాలని ఉపేక్షించాం. గత భారాస ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ప్రతిపక్ష హోదా లేకుండా సీఎల్పీ సీటును సైతం గుంజుకున్నారు. వాళ్ల మాదిరిగా మేము ప్రవర్తించడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు వినిపించాలని కోరుకుంటున్నాం. ప్రతిపక్ష నేతలంటే మాకు గౌరవం ఉంది. అసెంబ్లీలో అధికార పార్టీ ఎవరో.. ప్రతిపక్ష పార్టీ ఎవరో స్పీకర్ వెల్లడించారు. శాంతిభద్రతలు కాపాడటం మా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత. భాజపా ఉనికి కోసం రాజకీయ డ్రామాలు ఆడుతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల అకాంక్షలను..చట్టాలుగా మార్చి పాలన కొనసాగిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దశాబ్ద కాలంగా పెండింగ్ లో వున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామ ప్రజలకు 18 కోట్ల రూపాయలను అందజేశామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా రుణమాఫీ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. రైతులకు ఇన్స్యూరెన్స్ డబ్బులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్న భట్టి... 2030 వరకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా 20 వేల మెగవాట్ల విద్యుత్ ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నా మన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులకు ఆదాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా 30 గ్రామాలకు ప్రభుత్వ ఖర్చుతో వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ పవర్ అందించను న్నామన్నారు. మేడారం గ్రామాన్ని సోలార్ పవర్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా 18 వేల కోట్ల రూపాయలను 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేదనన్న భట్టి ఎల్లంపల్లి ముంపు గ్రామస్తులకు పెండింగ్ లో ఉన్న 18 కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఆదిలాబాదు నుండి ఖమ్మం వరకి పాదయాత్ర చేసానని, మీ అందరి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజల ఆశయాలని చట్టాలుగా మార్చి పని చేస్తుంది మా ప్రభుత్వమని, ప్రాజెక్టుల కొసం భూములని ఇచ్చిన వారికి గౌరవం ఇవ్వాలి.అందుకే నిధులు విడుదల చేస్తున్నామన్నారు. రెండు లక్షలు రుణమాఫి చేస్తానని మాట ఇచ్చాం చేసి చూపామని, హామీ ఇవ్వకున్నా 2 లక్షల పైన ఉన్న పంట రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించామని, లక్ష రుణమాఫి చేస్తానని మోసం చేసింది నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ మన్నారు. రుణమాఫీపై బీఅర్ఎస్ మాట్లాడే మాట లు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన మండిప డ్డారు. రెండు లక్షల పైన ఉన్నవారికి కూడ వెసులుబాటు కల్పించే యత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకా కుండా.' ఓడిపోయిన కూడ రోడ్ల మీదకి వచ్చి బిఆర్ఎస్ ఆందోళన చేస్తుంది. పంటలతో పాటుగా పవర్ ఉత్పత్తి ద్వారా రైతుకు ఆదాయం సమకూరే ఏర్పాటు చేస్తాం. మేడారం గ్రామానికి సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో విద్యుత్ రంగంలో తెలంగాణని మోడల్ గా తయ్యారు చేస్తాం. పత్తిపాక రిజర్వాయర్ కోసం బడ్జెట్ లో ప్రతిపాదించాము.త్వరలోనే పనులు మొదలు పెడతాం. ' అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఇద్దరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకుంటే.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. ఆ ఇద్దరూ బీఆర్స్ ఎమ్మెల్యేలే.. వారి అంతర్గత విభేధాలతో కొట్టుకున్నారని క్లారిటీ ఇచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. పనులు మొదలు పెడుతామన్నారు. పత్తపాక రిజర్వాయర్ కి ఈ బ్జడెట్ లో డబ్బులు కెటాయించామన్నారు. అర్థికమంత్రిగా భట్టి ఈ రాష్ట్రంని బడ్జెట్ పరంగా గాడిలో పెడుతున్నారని అన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే తప్ప అందరికీ రుణమాఫి అయ్యిందన్నారు. అంతకు ముందు పెద్దపల్లి జిల్లా మంథనిలో సెంటిలియన్ సాఫ్ట్ వేర్ కంపనీని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. మంథని ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభ ఉంటుందన్నారు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనేది మా సంకల్పం అన్నారు. మా మంథని ప్రాం త మేధస్సుకు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. మంథని లో త్వరలో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

# భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు

### కాల్వలకు గండ్లతో భారీగా నష్టం

### కేంద్రానికి నివేదిక అందించాలన్న ఉత్తమ్

హైదరాబాద్,సెప్టెంబర్14 : రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కాల్వలకు తెలంగాణ నీటిపారుదలశాఖ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులతోపాటు శాశ్వత పునరుద్ధరణ దిశగా చర్యలు వేగవంతం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు, చెరువులకు గండ్లు పడినట్టు గుర్తించారు. అందులో చిన్న నీటిపారుదల పరిధిలోని చెరువులకు 265 చోట్ల గండ్లు పడగా.. 285 చెరువులు దెబ్బతిన్నాయి. అదే విధంగా భారీ నీటిపారుదలతోపాటు మధ్యతరహా ప్రాజెక్టులకు చెందిన కాల్వలకు 132 చోట్ల గండ్లు పడగా.. 83 చోట్ల దెబ్బతిన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామ సమీపంలోని పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన వ్టటెం పంప్ హౌస్‌లోకి వరదనీరు చేరింది. ఖమ్మం జిల్లాలోనూ వరద ప్రభావంతో భక్త రామదాసు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ మునిగిపోయి అందులోని పరికరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చెరువులు, కాలువలు, పంప్ హౌజ్‌లు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 45వ జీవో ద్వారా నిధులు మంజూరు చేసింది. అంచనాల తయారీ, పరిపాలనా అనుమతులు, ఆర్థిక అనుమతుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంప్రదింపులు జరిపి, నిర్ణీత వ్యవధిలో పునరుద్ధరణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు నీటిపారుదలశాఖ తెలిపింది. ఖరీఫ్ పంటను కాపాడటంతోపాటు నీటి సరఫరాను కొనసాగించేందుకు చర్యలతోపాటు పూర్తి స్థాయిలో నష్టం అంచనాలను రూపొందించినట్లు వివరించింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఆ అంచనాలతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి నివేదిక అందించింది. నీటిపారుదల శాఖ పరిధిలో జరిగిన నష్టానికి సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భారీ, మధ్య తరహా 94 ప్రాజెక్ట్‌ల్లో నీటినిల్వలు పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఆస్తికోసం బావమర్ది హత్య

### ఆత్మహత్యగా చిత్రీకిరంచే యత్నం.. పోలీసుల విచారణతో బయటపడ్డ దారుణం

హైదరాబాద్,సెప్టెంబర్ 14 : ఆస్తి కోసం సొంత వారిని సైతం మోసం చేసే వారు కొందరైతే.. చివరకు హత్యలు చేసేందుకూ వెనుకాడని వారు మరికొందరు. ఆస్తి కోసం తమ్ముణ్ని మోసం చేసిన అన్న, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను రోడ్డుపైకి నెట్టేసిన కుమారులు, అక్కను మోసం చేసిన తమ్ముడు అంటూ వివిధ కథనాలు మనం రోజూ చూస్తునే ఉంటాం. తాజాగా అలాంటి ఘటనే హైదరాబాద్ నగరంలో చోటు చేసుకుంది. బాయ్స్ హాస్టల్ పెట్టిన ఓ వ్యక్తి బెట్టింగులకు బానిసై అప్పుల ఊబిలో కూరుకు పోయాడు. అందులో నుంచి బయటపడేందుకు బామ్మర్ది ఆస్తిపైనే కన్నేశాడు. అతణ్ని చంపేసేందుకు పథకం వేసి చివరికి అనుకున్నంత పనీ చేశాడు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన ఆస్తి మె?త్తం నొక్కేద్దామని కుట్ర పన్నాడు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తీగ లాగితే డొంక కదిలినట్లు పోలీసుల విచారణలో నిందితుడు చేసిన దారుణం తెలుసుకుని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి హైదరాబాద్ గచ్చిబౌలిలో బాలాజీ పీజీ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. శ్రీకాంత్‌కు క్రికెట్ బెట్టింగులు వేసే అలవాటు ఉంది. దీంతో సుమారు రూ.5కోట్ల మేర అప్పులు చేశాడు. దీని నుంచి బయపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. మరోవైపు తన బామ్మర్ది యశ్వంత్(25) చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం వేటలో నగరానికి వచ్చాడు. బావ హాస్టల్లోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. అప్పుల ఊబిలో కూరుకున్న శ్రీకాంత్‌కు ఓ ఆలోచన వచ్చింది. తనకు ఒక్కడే బామ్మర్ది కావడంతో అతణ్ని చంపి ఆస్తి కొట్టేయాలని అనుకున్నాడు. దీంతో ఓ ఇద్దరికి సుపారీ ఇచ్చి పథకం ప్రకారం సెప్టెంబర్ 1న హత్య చేయించాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. దీనిపై అదే రోజు గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదైంది. అనంతరం బాధితుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కావలికి మృతదేహాన్ని తరలించారు. తమ కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే అదే సమయంలో వారికి అతని శరీరంపై గాయాలు కనిపించాయి. ఆ బాధలో వారు దానిపై ఎలాంటి ప్రశ్నలు లేవనెత్తలేదు. అయితే కుమారుడి మృతిపై అనుమానం ఉన్న తండ్రి విషయం తెలుసుకునేందుకు శుక్రవారం గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు తమదైన రీతిలో విచారణ చేపట్టారు. ప్రధాన నిందితుడు, మృతుడి బావ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. ఆస్తి కోసం తానే హత్య చేయించినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులంతా అవాక్కయ్యారు. అతని చేసిన పనికి గుండెలు పగిలేలా ఏడ్చారు. అయితే సుపారీ తీసుకున్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జల్సాలకు అలవాటు పడి వాహనాలు చోరీ

### దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలింపు

మెదక్,సెప్టెంబర్14 : జల్సాలకు అలవాటు పడి వాహనాలు చోరీ చేస్తున్న ఓ దొంగను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. మెదక్ జిల్లా శివంపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. స్థానికులు అందించిన సమాచారంతో శివంపేట పోలీసులు మండల పరిధిలోని కొత్తపేట గ్రామపంచాయతీలోని రూపుల తండాకు చెందిన జర్పుల మోహన్ అనే 27 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో చోరీ విషయం బయటపడింది. ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి నరసాపూర్ మండలం రెడ్డిపల్లికి చెందిన నరేష్ అనే యువకుడికి తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, వీరిద్దరినీ ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.6,10,000 ఉంటుందన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ వెంకటరెడ్డి, తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్సై మహిపాల్‌రెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు.

## దొంగతనాలు చేస్తూ పట్టబడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

హైదరాబాద్,సెప్టెంబం"14 : చేసేది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. జల్సాలకు అలవాటు పడి చోరీల బాట పట్టాడు. పగలు ఉద్యోగం చేస్తూ.. రాత్రిపూట మరో ఇద్దరితో కలిసి వాహనాల బ్యాటరీల చోరీకి పాల్పడేవాడు. ఈ ముఠా గుట్టును తలకొండపల్లి పోలీసులు రట్టు చేశారు. ప్రధాన నిందితుడు ఇర్ఫాన్ హుస్సేన్ (26)ని అరెస్టు చేశారు. నిందితుడు హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠా గత నెలలో చుక్కాపూర్‌లో 8 ట్రాక్టర్లు, ఓ టిప్పర్ బ్యాటరీలను దొంగతనం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హుస్సేన్‌ను అరెస్టు చేసి.. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

### గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం

### ప్రజావాణిలో గల్ఫ్ కార్మికలు వినతులకు సెల్

### మంత్రి పొన్నం అధ్యక్షతన సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్,సెప్టెంబర్14 : గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ చేసింది. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే ప్రాంతాల ఎమ్మెల్యేలు, నేతలతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చనిపోయిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని చర్చించారు. ప్రజావాణిలో గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ వినోద్ ఆధ్వర్యంలో మొత్తం 5 అంశాలపై చర్చించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గల్ఫ్ కార్మికుల కమిటీలో గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఈ కమిటీలో సభ్యులుగా నియమించాలని.. ఈ మేరకు జీవో విడుదల చేయాలని సూచించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రజావాణిలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహించడంపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సెప్టెంబర్ 20 నుంచి గల్ఫ్ కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాలలో కళాశాలలో చదవాలని అనుకునే వారికి వందశాతం అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇచ్చేలా సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గతంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సైతం రూ. 1 లక్ష ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని సూచించింది. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2 , 2014 లేదా ఎప్పటినుంచి తీసుకోవాలనే దానిపై కమిటీలు పలు సూచనలు చేశాయి. గల్ఫ్ లో మృతి చెందిన వేములవాడ నియోజకవర్గానికి చెందిన 2 కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ నుంచి ఎక్స్ గ్రేషియా ఇచ్చామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతు భీమా మాదిరి గల్ఫ్ భీమా ఉండాలని పలువురు ఎమ్మెల్యేలు సైతం సూచించారు. ఇటీవల సింగపూర్, మలేషియాలలోని కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పగా.. టీపిసిసి ఎన్ఆర్ఐ కన్వీనర్ ఇమిగ్రేషన్ 1982 యాక్ట్ లో గల్ఫ్ దేశాల్లో 18 దేశాలు ఉంటాయి. సింగపూర్ లాంటి దేశాలు కూడా గల్ఫ్ కిందకి వస్తాయని కొందరు బదులిచ్చారు. తెలంగాణ లో 150 ట్రేడ్ లైసెన్స్ మన్ పవర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలు ఉన్నాయి. టాంటం, న్యాక్, సెట్విన్ లాంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ సూచించారు. ఏజెన్సీల పేరుతో మోసం జరుగుతుందని, ఇకపై అలా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటివరకూ గల్ఫ్ కార్మికులు ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని ఇక్కడికి రప్పించడానికి 7 రోజులకు పైగా పడుతోందని.. కనీసం 48 గంటల్లో డెడ్ బాడీ వచ్చేలా చూడాలని కోరారు.




# పేస్ పిచ్ సిద్ధం

## జోరుగా భారత బౌలర్ల ప్రాక్టీస్.. 19 నుంచి బంగ్లాతో తొలి టెస్టు

చెన్నై: ఆరు నెలల తర్వాత టీమిండియా టెస్టు ఫార్మాట్ బరిలోకి దిగబోతోంది. దీంట్లో భాగంగా ఈనెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు కోసం పకడ్బందీగా వ్యూహాలు రచిస్తోంది. ఎందుకంటే పాకిస్థాన్‌తో ఇటీవలే ముగిసిన రెండు టెస్టుల సిరీసను బంగ్లా క్లీన్‌స్వీప చేసింది. అదే ఊపులో పటిష్ఠ టీమిండియాకు కూడా షాక్ ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. అయితే తమకన్నా బలహీన జట్టయినా బంగ్లాను రోహిత్‌సేన తక్కువగా చూడడం లేదు. అందుకే అద్భుతంగా రాణిస్తున్న వారి బౌలర్లకు ముకుతాడు వేసేందుకు చెపాక్‌లో ఎర్రమట్టితో కూడిన పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి చెన్నై పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. అటు బంగ్లాలో కూడా బంక మట్టి ఎక్కువగా ఉండే నల్లమట్టి పిచ్‌లపైనే ఆడతారు.

ఆరంభం నుంచే ఇవి స్పిన్నర్లకు అనుకూలిస్తుంటాయి. అందుకే బంగ్లా బౌలర్లకు అవకాశం ఇవ్వకూడదనే ఆలోచనతో ఎర్రమట్టి పిచ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇందులో క్లే తక్కువగా ఉంటుంది కాబట్టి ఆరంభంలో బౌన్స్ రాబడుతూ పేసర్లు చెలరేగుతారు. అంతేకాకుండా ఈ ఏడాది చివర్లో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించాల్సి ఉంది. అక్కడి పిచ్‌ల దృష్ట్యా కూడా ఈ మార్పులు చేసినట్టు సమాచారం. అయితే నెట్స్‌లో గంభీర్, మోర్కెల్ ఆధ్వర్యంలో భారత స్పిన్నర్లు నల్లమట్టి..




పేసర్లు ఎర్రమట్టి పిచ్‌లపై సాధన చేస్తున్నారు.' పేసర్ గుర్నూర్ బ్రార్‌తో.. నెట్స్‌లో భారత బ్యాటర్లకు బంతులు వేసేందుకు ఆరున్నర అడుగుల పంజాబీ పేసర్ గుర్నూర్ బ్రార్‌ను ప్రత్యేకంగా రప్పించారు. బంగ్లా జట్టులో కూడా ఇదే ఎత్తుతో పేసర్ నహీద్ రాణా ఉన్నాడు. పాక్‌తో జరిగిన రెండో టెస్టులో నవీద్ 5 వికెట్లతో చెలరేగాడు. అతడి బౌన్స్‌ను భారత్ దీటుగా ఎదుర్కొనేందుకే బ్రార్‌ను ఎంపిక చేశారు. తొలి టెస్టు మొదలయ్యేదాకా అతడు జట్టుతో పాటు ఉంటాడు.

### నాది చిన్న పాత్రే:మోర్కెల్

భారత క్రికెట్ అభివృద్ధి కోసం కొత్తగా ఎవరూ ఏమీ చేయాల్సిన అవసరం లేదని, తనంతట తానుగా ముందుకు వెళ్లే వ్యవస్థ ఏర్పాటైందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్కెల్ అభిప్రాయపడ్డాడు. ఈక్రమంలో జట్టు మరింత పటిష్టంగా తయారయ్యేందుకు ఏం చేయగలనో అదే చేస్తానని చెప్పాడు. ఏరకంగా చూసినా ఇందులో నాది చిన్నపాత్రేనని తెలిపాడు. రోహిత్, విరాట్, జడేజా, అశ్విన్, బుమ్రాలాంటి సూపర్ సీనియర్లు జట్టును ముందుండి నడిపిస్తారని, సహాయక సిబ్బందిగా వారికి అవసరమైన సలహాలు ఇవ్వడం కోచ్‌లుగా తమ బాధ్యతని స్పష్టం చేశాడు.

# తిలక్ సెంచరీ

## పట్టుబిగించిన ఇండియా 'ఎ'

అనంతపురం : యువ బ్యాటర్ తిలక్ వర్మ (111 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కగా..ఓపెనర్ ప్రథమ్ సింగ్ (122) కూడా సెంచరీతో చెలరేగడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పట్టుబిగించింది. ఓవర్‌నైట్ 115/1తో శనివారం, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'ఎ' 380/3తో డిక్లేర్ చేసింది. దాంతో ఆ జట్టుకు ఓవరాల్‌గా 487 పరుగుల ఆధిక్యం లభించింది. ప్రథమ్, తిలక్ రెండో వికెట్‌కు 104 రన్స్ జోడించారు. అనంతరం రావత్ (64 నాటౌట్) జతగా తిలక్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 116 రన్స్ జత చేశాడు. ఆపై 488 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'డి' మూడోరోజు ఆఖరికి 62/1 స్కోరుతో నిలిచింది. రికీ భుయ్ (44), యశ్ దుబే (15) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 290, ఇండియా 'డి' 183 పరుగులు చేశాయి.



# సబ్లేకు తొమ్మిదో స్థానం

భారత అథ్లెట్ అవినాశ్ సబ్లే డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో నిరాశపరిచాడు. 3వేల మీటర్ల స్టీపుల్‌చేజ్ ఈవెంట్‌లో పోడియం ఫినిష్ చేయడంలో విఫలమయ్యాడు. శుక్రవారం 30వ బర్త్‌డే సెలెబ్రేట్ చేసుకున్న అవినాశ్.. ఫైనల్స్‌లో 8 నిమిషాల 17.09 సెకన్ల టైమింగ్‌తో 9వ స్థానంలో నిలిచాడు. మొత్తం పది మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో చివరి నుంచి రెండోస్థానం దక్కించుకోవడం గమనార్హం. కెన్యా స్టార్ అమోజ్ సెరెమ్ (8 నిమిషాల 6.90 సెకన్లు) టైటిల్ దక్కించుకోగా, మొరాకోకు చెందిన ఒలింపిక్, వరల్డ్ చాంప్ సోఫినె (8 నిమిషాల 8.60 సె) రెండు, ట్యూనీషియా అథ్లెట్ మహ్మద్ అమిన్ (8 నిమిషాల 9.68 సె) మూడు స్థానాల్లో నిలిచారు.



# పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం

## ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ

హులున్‌బుయిర్(చైనా): ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుస విజయాలతో దూసుకెళుతున్నది. డిఫెండింగ్ చాంపియన్ హెూదాలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకున్న టీమ్ఇండియా..తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1తో దాయాది పాకిస్థాన్‌పై విజయదుందుభి మోగించింది. తద్వారా టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరోవైపు టోర్నీలో ఇప్పటి వరకు అపజయమెరుగని పాక్..భారత్ చేతిలో తొలి ఓటమి ఎదుర్కొంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(13ని, 19ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, అహ్మద్ నదీమ్(8ని) పాక్‌కు ఏకైక గోల్ అం దించాడు. 2016 నుంచి పాక్‌పై తమ అప్రతిహత విజయాలతో ఆకట్టుకుంటున్న టీమ్ఇండియా అదే పరంపరను కొనసాగించింది. గతేడాది హాంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా గేమ్స్‌లో 10–2తో భారీ విజయం సాధించిన భారత్..చెన్నైలో ఏసీటీ




టోర్నీలోనూ 4–0తో చిత్తు చేసింది.

### ఆది నుంచే జోరు:

చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరు ఆరంభం నుంచే ఆకట్టుకుంది. మ్యాచ్ మొదలైన తొలి నిమిషం నుంచే ఇరు జట్ల ప్లేయర్లు గోల్ లక్ష్యంగా ముందుకు కదిలారు. బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. అయితే మ్యాచ్ 8వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ హన్నన్ షాహిది అందించిన పాస్‌ను నదీమ్ ఫీల్డ్ గోల్‌గా మలువడంతో పాక్ 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. వెంటనే తేరుకున్న భారత ఎదురుదాడికి దిగింది. పాక్ గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మన దళాలు చురుకుగా ముందుకు కదిలాయి. ఆరు నిమిషాల తేడాతో దక్కిన రెండు పెనాల్టీ కార్నర్లను స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్‌సింగ్ గోల్స్ చేయడంతో భారత్ ఆధిక్యం 2–1కి పెరిగింది. హర్మన్ కొట్టిన పవర్‌ఫుల్ షాట్లను అడ్డుకోవడంలో పాక్ గోల్‌కీపర్ మునీబ్ విఫలమయ్యాడు. అయితే స్కోరును సమం చేసేందుకు పాక్ ప్లేయర్లు ఎంతగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రెండో క్వార్టర్ ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీ కార్నర్‌ను పాక్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. కీలకమైన చివరి క్వార్టర్‌లో భారత్‌కు మూడు పెనాల్టీ కార్నర్లు దక్కినా..గోల్స్‌గా మలువలేకపోయింది. ఇదిలా ఉంటే హర్మన్‌ప్రీత్‌కు పాక్ ప్లేయర్ అష్రాఫ్ వహీద్‌కు మధ్య మాటల తూటాలు పేలాయి. జుగ్‌రాజ్‌సింగ్‌ను వహీద్ దురుసుగా అడ్డుకోవడంతో 10 నిమిషాల పాటు సస్పెన్షన్‌కు గురయ్యాడు


EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక



## మంథనిలో సాఫ్ట్ వేర్ కంపెనీ ప్రారంభం

మంథని-జనత న్యూస్ : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గిట్లస్ హబ్ వద్ద శనివారం సెంటిలియన్ నెట్‌వర్క్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు. మంథనిలో బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషకరమని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




## విద్యుత్ రంగంలో దేశానికే

# ఆదర్శంగా తీర్చి దిద్దుతాం

### 2030 అంచనాతో గ్రీన్ ఎనర్జీ సాధన దిశగా కృషి

**పైలెట్ గ్రామాల్లో సోలార్ పంప్‌సెట్ల ఏర్పాటు**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు రూ.18 కోట్ల చెక్కులు**

ధర్మారం-జనత న్యూస్ విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణను ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్ లతో పాటు విస్తృతంగా పర్యటించారు. జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం బందానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ నంది మేడారం హెలిప్యాడ్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. మేడారం వద్ద 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, కట్కెనపల్లి గ్రామంలోని 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. అనంతరం ధర్మారం, వెల్గటూరు, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం

మిగతా 2 లో



‘ఇందిరా మహిళా శక్తి’ ద్వారా..

# సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు

**5 ఏళ్లలో రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**పెద్దపల్లి అసెంబ్లీలో అభివృద్ధి పనులు ప్రారంభం**



పెద్దపల్లి -జనత న్యూస్ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలో 12 ఎకరాల స్థలాన్ని సేకరించి సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. పెద్దపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యే విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ లతో కలసి ఆయన ప్రారంభించారు. జూలపల్లి మండలం కాచాపూర్‌లో 132 కేవి సబ్ స్టేషన, పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని 33/11 కేవి సబ్ స్టేషన్ , ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ భవన నిర్మాణం, పెద్దపల్లి పట్టణంలోని మార్కెట్

మిగతా 2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నరేందర్ రెడ్డి



కరీంనగర్-జనత న్యూస్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని ఎస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్‌లో ఉదయం వాకర్స్‌ను కలిశారు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించిన నరేందర్ రెడ్డి..పట్టభద్రుల

మిగతా 2 లో

# వరద బాధితులకు నెలాఖరులోగా ఇండ్లు

**వరదలతో రూ.10, 300 కోట్లకు పైగా నష్టం**

**వచ్చే వారం ప్రధానమంత్రి, కేంద్ర హెూంమంత్రి వద్దకు బృందం**

**త్వరలో ఎకరాకు రూ. 10 వేల పరిహారం పంపిణీ**

**యుద్ధ ప్రాతిపదికన పాలేరు ఎడమ కాలువ మరమ్మతులు**

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి**

**పాలేరు నియోజక వర్గంలో విస్తృత పర్యటన**



ఖమ్మం-జనత న్యూస్ : యుద్ధ ప్రాతిపదికన పాలేరు ఎడమ కాల్వ గండి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ముందుగా కూసుమంచి మండలం హట్యా తండా వద్ద పాలేరు ఎడమ కాల్వ గండి ప్రదేశాన్ని

మిగతా 2 లో



## గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు

**డీజే, టాపాసులు పేల్చడం నిషేదం**

**పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి**

కరీంనగర్-జనత న్యూస్ : నగరంలో సెప్టెంబర్ 16న సోమవారంనాడు జరగనున్న గణేష్ నిమజ్జన శోభయాత్ర రూట్ ప్రచారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ అభిషేక్ మహంతి

మిగతా 2 లో



## ఉమాపుత్ర గణపతికి పెరిగిన భక్తుల తాకిడి

కరీంనగర్, జనతా న్యూస్: నగరంలోని విద్యానగర్ , పారిస్ లైన్. లో కొలువుదీరిన విఘ్నానాయకుని కి శనివారం ప్రత్యేక ఆలంకరణలతో పూజలు నిర్వహించారు. కాగా ఇక్కడి గణేషుణ్ణి దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రోజు రోజు కు భక్తుల తాకిడి పెరుగుతుండటం విశేషం.నగరంతో పాటుగా చుట్టూ గ్రామాలనుండి ప్రజలు అర్ద రాత్రి వరకు దర్శనం కోసం క్యూ లైన్ లో ఉంటున్నారు.





# విద్యుత్ రంగంలో దేశానికే ఆదర్శంగా తీర్చి దిద్దుతాం





మొదటి పేజీ తరువాయి

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి ఉండే విద్యుత్ డిమాండ్ ను అంచనా వేస్తూ, ఇందుకు అనుగుణంగా గ్రీన్ పవర్, సోలార్ పవర్, ఫ్లోటింగ్ సోలార్, పంప్ స్టోరేజ్ ఎనర్జీ మొదలగు రంగాల్లో సుమారు 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని గ్రామాలను ఎంపిక చేసి, ఆ గ్రామాలలోని రైతుల మోటార్లకు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో పూర్తి స్థాయిలో సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. రైతులకు పంటలతో పాటు విద్యుత్తు తో కూడా ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ విప్ అభ్యర్థన మేరకు మేడారంలో పూర్తి స్థాయిలో రైతులకు సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు . ప్రజల భావోద్వేగాలను అర్థం చేసుకొని రామగుండంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే ఈ ప్రాజెక్టుకు భూమి పూజ నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి బడ్జెట్ లో నిధులు కేటాయించామని , సర్వే పనులు పూర్తి చేసిన తరువాత నిర్మాణ పనులు ప్రారంభిస్తామని అన్నారు. పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. మండల వాగు ఎల్లంపల్లి లిఫ్ట్ సంబంధించి సబ్ స్టేషన్ నిర్మిస్తే వేల ఎకరాలకు నీరు పారుతుందని అందిన ప్రతిపాదనల మేరకు సబ్ స్టేషన్ ను వెంటనే మంజూరు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలంలో సమీకృత గురుకుల భవన నిర్మాణాన్ని త్వరలో మంజూరు చేస్తామని అన్నారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ..టేయిల్ ఎండ్ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు పత్తిపాక రిజర్వాయర్ ఏర్పాటు ద్వారా మంథని పెద్దపెల్లి ,రామగుండం, ధర్మపురి నియోజకవర్గాలకు సాగునీరు స్థిరీకరణ అవుతుందని తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు చేశామని, సర్వే పనులు పూర్తి చేసిన తర్వాత ప్రతిపాదనలు రూపొందిస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. పెండిరగ్ భూ నిర్వాసితుల సమస్య ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా తెప్పించుకొని మరో 7 కోట్ల నిధులను కూడా మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. ధర్మారం మండలంలో ఐటిఐ లేదా పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బొమ్మిరెడ్డిపల్లి గ్రామం దగ్గర కొత్తపల్లి కాల్వ పెండిరగ్ పనులు మరో 7 కోట్ల రూపాయలు మంజూరు చేస్తే పూర్తవుతాయని , దీని వల్ల దాదాపు 10 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ , అదనపు కలెక్టర్ లు జే.అరుణ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఆర్డిఓలు గంగయ్య, హనుమా నాయక్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'ఇందిరా మహిళా శక్తి' ద్వారా.. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు





మొదటి పేజీ తరువాయి

యార్డ్, 33/11 కేవి సబ్ స్టేషన్ , పెద్దరాతి పల్లి 33/11 కేవి సబ్ స్టేషన్, అమృత్ 2.0, తాగునీటి సరఫరా పనులు, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. నియోజక వర్గంలోని ఆయా ప్రాంతాల్లోని సుమారు రూ. 80 కోట్ల అభివృద్ధి పనులను భట్టి విక్రమార్క ప్రారంభించారు. అనంతరం పెద్దపల్లి జెండా చౌరస్తా వద్ద సభలో మాట్లాడుతూ..ఎస్సారెస్పీ టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సాగు నీరందించేందుకు పత్తిపాక రిజర్వామయర్‌ను నిర్మిస్తామన్నారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు, ఓదెల మండలంలో మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు సైతం ప్రజా ప్రభుత్వం మంజూరు చేసి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. పెద్దపల్లిలో భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకుని 30 కోట్ల రూపాయలతో 5 సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగే దిశగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాలకు రాబోయే ఐదు సంవత్సరాలలో రూ. లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. ఓదెల మండలంలోని మానేరు నది పై బ్రిడ్జి నిర్మాణం , పెద్దపల్లి బైపాస్, సుల్తానాబాద్ బైపాస్ పనులకు ముఖ్యమంత్రి సూచన ప్రాయంగా ఆమోదం తెలిపారన్నారు. యువతకు ఉ పాధి అందించే దిశగా టాస్క్ రీజనల్ సెంటర్ ను పెద్దపల్లిలో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. గడిచిన 9 నెలల కాలంలో ఒక్కటి తర్వాత ఒక్కటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ.. పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మాణంతో పాటు బస్సు డిపో మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రిని కోరారు. పెద్దపల్లి నుంచి జమ్మికుంట పోయే రోడ్డు పొత్కపల్లి నుంచి వెళ్లే విధంగా రోడ్డు వేస్తే 14 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని , ఓదెల మండలం శ్రీరాంపూర్ మండలంలోని రైతులకు చాలా ఉపయోగపడుతుందని విజ్ఞప్తి చేశారు. సుల్తానాబాద్‌లో ఐటి టవర్ నిర్మాణం, నియోజక వర్గంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రతిపాదనలు సైతం పరిశీలించాలని డిప్యూటీ సీఎంను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ , అదనపు కలెక్టర్ లు జే.అరుణ శ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఆర్డిఓలు బి.గంగయ్య, వి.హనుమా నాయక్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు నెలాఖరులోగా ఇండ్లు





మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. కాల్వ గండి పూడిక వివరాలు, తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ పనులు, ప్రధాన కాల్వ స్లాబ్ నిర్మాణ పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎడమ కాల్వ గండి పూడిక తీత పనులు 24 గంటల పాటు జరగాలని, ఇక్కడ అవసరమైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 4 రోజులలో పనులు పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు వదలాలని, కాల్వ యూటి స్లాబ్, పాలేరు ఎడమ కాల్వ శాశ్వత పునరుద్ధరణ పనులు సైతం చేపట్టి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భారీ వరదల వల్ల కలిగిన నష్టాలపై మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన అతి భారీ వర్షాలు, వరదల కారణంగా దాదాపు 10 వేల 300 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అన్నారు. గంటల వ్యవధిలో 37 నుండి 38 సెంటీమీటర్ల మేర కుంభవృష్టి లాంటి వర్షం కురవడం వల్ల వాగులు, వంకలు ఏకమై భారీ ఎత్తున వరదలు వచ్చి ఇండ్లు, పశువులు, పంట పొలాలు, రోడ్లు, బ్రిడ్జిలు తెగిపోయి పెద్ద ఎత్తున నష్టం వచ్చిందన్నారు. తెలంగాణలో భారీ విపత్తు నుంచి ప్రజలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కోరామని, ముఖ్యమంత్రి అభ్యర్థన మేరకు రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ బృందాలు పర్యటించి క్షేత్ర స్థాయిలోని పరిస్థితులను తెలుసుకున్నాయని మంత్రి తెలిపారు. భారీ వర్షాల కారణంగా పాలేరు ఎడమ కాల్వకు గండి పడిరదని, అదేవిధంగా మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులు, కొన్ని చెరువులు దెబ్బతిన్నాయని వాటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున పరిహారాన్ని త్వరలోనే అందజేస్తామన్నారు. ఇల్లు కోల్పోయిన వారికి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్ల క్రింద 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వరదల కారణంగా పాక్షికంగా ఇండ్లు దెబ్బతిన్న వారికి 16 వేల 500 రూపాయల ఆర్థిక సహాయం అందించామని, కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం అందిన తర్వాత రైతులకు మరింత సాయం అందించే దిశగా తమ ప్రభుత్వం ఆలోచన చేస్తుందని మంత్రి తెలిపారు. మన రాష్ట్రంలో ఉన్న 8 బేటాలియన్లలో ఒక్కో బెటాలియన్ నుండి 100 మంది పోలీస్ సిబ్బందిని ఎంపిక చేసి వరద సహాయక చర్యలపై ప్రత్యేక శిక్షణ అందించి, కావాల్సిన పరికరాలు సమకూర్చి, భవిష్యత్తులో వచ్చే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు అవసరమైన పడవలు, ఇతర సామాగ్రి పూర్తి స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. వరదలను పరిశీలించేందుకు మన రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రుల సహకారం తీసుకుని అధిక సహాయం సాధన దిశగా కృషి చేస్తామని, వచ్చేవారం ప్రధానమంత్రి, కేంద్ర హెూం మంత్రుల సమయం తీసుకొని ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రుల బృందం వెళ్లి విపత్తు సహాయం కోసం ప్రతిపాదనలు అందిస్తామన్నారు.

విపత్తు సమయంలో ఎలాంటి బేషజాలకు తమ ప్రభుత్వం పోదని, మన రాష్ట్రానికి అత్యధికంగా కేంద్రం నుంచి విపత్తు సహాయం తీసుకొచ్చే దిశగా కృషి చేస్తామని మంత్రి తెలిపారు. అనంతరం వరద ప్రభావితమైన కూసుమంచి మండలం మల్లాయిగూడెం, కట్టు కాచారం, తిరుమలాయ-పాలెం మండలం రావిచెట్టు తండ వద్ద దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జి, విద్యుత్ స్తంభాలు పరిశీలించి వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఇరిగేషన్ ఇఇ లు వెంకటేశ్వర రావు, అనన్య, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నరేందర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తనకు మద్దతివ్వాలని కోరారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, వ్యాయామం చేస్తున్నారన్నారు. పట్టభద్రుల సమస్యలను పరిష్కరించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా తాను ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నాని చెప్పారు. విద్యారంగంలో అపార అనుభం ఉందని, జూనియర్ కళాశాలలు ఎదురుకుంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ నరేందర్ రెడ్డికి మద్దతు తెలుపడంతో పాటు ప్రచారంలో సైతం ముందుంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థల యాజమాన్యాలు, సేవాసంస్థల నిర్వాహకులు, యువజన సంఘాల నాయకులు, సుమారు 250 మంది వాకర్స్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నిమజ్జన కేంద్రాల్కైన మానకొండూరు చెరువు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతోపాటు, పోలీసు పరంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. గణేష్ శోభాయాత్రలో డీజేల వినియోగంతోపాటు బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించామన్నారు. అదేవిధంగా నిమజ్జనం కొరకు నిర్వహించే శోభాయాత్రలో పాల్గొనే భక్తులు ఎటువంటి ఆయుధాల ప్రదర్శన, ఇతరులను గాయపరిచే వస్తువులు కలిగివుండరాదని, విద్వేషపూరిత నినాదాలు, ప్రసంగాలు చేయ రాదని, నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా భక్తి శ్రద్దలతో, మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమ్మజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు.

## వంటనూనెలు బ్లాక్ చేసిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

### గోదాములపై దాడులు నిర్వహించాలి



కరీంనగర్-జనత న్యూస్ : కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై 20% సుంకాన్ని పెంచడంతో కరీంనగర్‌లోని వ్యాపారులు నిల్వలను బ్లాక్ చేశారని ఆరోపించారు సీపీఐ నగర కార్యదర్శి కశిరెడ్డి సురేందర్ రెడ్డి. నగరంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు లతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. సన్ ఫ్లవర్ పై క్లస్టమ్స్ సుంకాన్ని 32.5 శాతానికి పెంచడంతో అప్రమత్తమైన వ్యాపారులు తమ వద్ద ఉన్న వంట నూనె స్టాకులు గోదాములలో నిల్వ ఉంచుకొని ప్రజలకు, చిరు వ్యాపారులకు విక్రయించకుండా బ్లాక్ చేశారని , రేపటినుండి పెరిగిన ధరలతో ప్రజలపై దోపిడీకి పాల్పడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారుల తీరుతో సామాన్య, పేద వర్గాలు నష్టపోతారన్నారు. ధరలు పెరుగుతాయనే ముందస్తు సమాచారంతో నూనె వ్యాపారులు శనివారం వారి దుకాణాలను బంద్ చేసి, అక్రమ దందాకు పాల్పడడం దుర్మార్గం అన్నారు. సేల్స్ టాక్స్ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తుమ్మేటి లేని లోటు పూడ్చలేనిది

కరీంనగర్-జనత న్యూస్ : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి ఆకస్మిక మృతి కలచి వేసిందని కాంగ్రెస్ పార్లమెంటు ఇంఛార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. సమ్మిరెడ్డి ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి నాయకుడి నుంచి సుదీర్ఘకాలం పనిచేస్తూ కాంగ్రెస్‌లో అంచలంచెలుగా ఎదిగారని.. ఆయన మృతి పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు తీరని లోటు అని తెలిపారు. సమ్మిరెడ్డి మృతి పట్ల వెలిచాల రాజేందర్ రావు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సమ్మిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి మనోధ్కైర్యం కల్పించాలని ఆ దేవుడికి ప్రార్థిస్తున్నట్లు వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ సేవలు ప్రారంభించిన హైకోర్టు జడ్జి



కరీంనగర్-జనత న్యూస్ : కరీంనగర్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాంకేతిక విభాగం ( డిజిటైజేషన్)ను రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ శనివారం జిల్లా జడ్జి బి ప్రతిమతో కలిసి ప్రారంభించారు. ఈ ఆన్లైన్ కంప్యూటర్ విధానంతో అన్ని కోర్టులలో ఉన్న కేసుల రికార్డులను నదమోదు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ పనితీరును హైకోర్టు జడ్జికి ఆన్ లైన్ నమోదు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వివరించారు. అనంతరం న్యాయమూర్తులతో నిర్వహించిన జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన హైకోర్టు జడ్జి సాయంత్రం హైదరాబాద్ కు తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పివి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యవర్గం ,అదనపు జిల్లా న్యాయమూర్తులు, సబ్ జడ్జి, మేజిస్ట్రేట్స్ , జిల్లా కోర్టు పాలనాధికారి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా భావంతోనే.. రాజకీయాల్లోకి

## ఎమ్మెల్సీగా అవకాశం కల్పించండి

## నిరుద్యోగుల తరపున పోరాడతా : ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



హుజూరాబాద్ సెప్టెంబర్14 జనతా న్యూస్: తాను సేవా భావంతోనే రాజకీయాల్లోకి వస్తున్నానని, తనను ఆశీర్వదించాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం హుజూరాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తను పోటీ చేయనున్నట్టు తెలిపారు. కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేస్తానని, తనకు మద్దతు నివ్వాలని కోరారు. తాను గత 30 ఏళ్లకు పైగా విద్యాసంస్థల నిర్వహణలో ఉన్నానని, తన సంస్థల్లో చదువు అభ్యసించిన విద్యార్థులు దేశ విదేశాల్లో మంచి పేరు ప్రఖ్యాతలు పొందారని అన్నారు. రాజకీయాలంటే వ్యాపారంగా నేటి కాలంలో మారిపోయిందని, కానీ తాను మాత్రం సేవా భావంతో రాజకీయాలను ఎన్నుకున్నారని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో నిరుద్యోగ యువత పెరిగిపోయిందని, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఉద్యోగాలు కూడా నామమాత్రంగానే వస్తున్నాయని, దిక్కు తోచని స్థితిలో యువత కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రాష్ట్రంలో ప్రధానమైన సమస్య నిరుద్యోగ సమస్య అని, ఈ సమస్య రూపుమాపేందుకు బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాల్సి ఉందని అన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాలతో పాటు, స్వయం ఉపాధి, కార్పొరేట్ రంగంలో ఉపాధి, ప్రభుత్వ రంగంలో ఉపాధి వంటి వాటిని అమలు చేయాలని అన్నారు. తాను నిరుద్యోగుల తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. తనకు ఓటర్లు మద్దతునిచ్చి ఆశీర్వదించాలని కోరారు.

# అనారోగ్యంతో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి



హుజురాబాద్ సెప్టెంబర్ 14: హుజురాబాద్ పట్టణానికి చెందిన విద్యానగర్ నివాసి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి జిన్న జనార్దన్ రెడ్డి (జీజే రెడ్డి) (85) శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుదీర్ఘకాలం ఆయన ఆర్టీసీలో కండక్టర్గా, కంట్రోలర్ గా, సిఐగా విధులు నిర్వహించారు. ఆయన కుమారుడు జిన్న ప్రకాష్ రెడ్డి కూడా ఆర్టీసీ ఉద్యోగిగా కరీంనగర్ డిపోలో పనిచేస్తున్నారు. జనార్దన్ రెడ్డి మృతికి పలువురు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. జనార్దన్ రెడ్డి అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

# సమతుల ఆహారంతో ఎనిమీయాను పారదోలాలి...



రాజన్న సిరిసిల్ల,జనత న్యూస్: సమతుల ఆహారంతో ఎనిమీయాను పారదోలాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మిరాజం సూచించారు. శనివారం వేములవాడ పట్టణంతో మారుపాక, లింగంపల్లి,హనుమాజీపేట,బొల్లారం,మంగళపల్లి గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమాలను జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం సందర్శించి పరిశీలించారు. పోషకారంతో రక్తహీనత నుండి కాపాడుకోవచ్చునని లక్ష్మి రాజం సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సుచరిత సూపర్వైజర్ అంజమ్మ,డి హబ్ కో ఆర్డినేటర్ రోజా,సఖి కౌన్సిలర్ సుమలత, అంగన్వాడీ టీచర్లు,ఆయాలు,ఆశాలు,హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# 4 లక్షలకు పైగా ఓటర్ల జాబితా విడుదల

పెద్దపల్లి-జనత న్యూస్ : జిల్లాలో పంచాయతీ రాజ్ ఓటర్ల మ్యాప్ జాబితా కన్ఫామ్ లిస్టులో 4 లక్షలకు పైగా ఓటర్ల మ్యాప్ చేయబడ్డారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 269 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2 లక్షల వేయ్యి 164 మంది పురుష ఓటర్లు, 2 లక్షల 6 వేల 881 మహిళా ఓటర్లు, 13 మంది ఇతర ఓటర్లు, మొత్తం 4 లక్షల 8 వేల 58 మంది ఓటర్లు మ్యాప్ చేయబడి ఉన్నారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యం

## అంగన్వాడి కేంద్రాలను వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## ఎనీమియా నిర్ధారణ శిబిరాల తనిఖీ



సిరిసిల్ల-జనత న్యూస్ : గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎనిమియా నిర్ధారణ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షలకు వచ్చిన వారి వివరాలను తెలుసుకున్న ఆయన..నమోదు రిజిస్టర్లను తనికీ చేశారు. గర్భిణులు, బాలింతల పరీక్షా విధానాన్ని పరిశీలించారు. లింగన్నపేట ఆరోగ్య కేంద్రంలో ఎంతమందికి పరీక్షలు చేశారో వైద్యుడిని అడిగి తెలుసుకున్నారు. 108 మందికి ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేశామని డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి కలెక్టర్కు వివరించారు. ఆయా పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతినెల పోషకాహారాన్ని తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రక్త శాతం తక్కువ ఉన్న వారు మందులు, పండ్లు, డ్రైఫ్రూట్ తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పీ హెచ్ సీ ఆవరణ, ల్యాబ్, మందులగది, ఇన్ పేషెంట్ గదులను, అలాగే డెంగ్యూ నిర్ధారణ పరీక్షలను పరిశీలించారు. పీ హెచ్ సీ ఆవరణను గ్రామపంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించుకోవాలని వైద్యుడికి కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో దవాఖానకు వస్తున్న అందరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని వివరించారు.

**తాత్కాలిక రోడ్డు పనుల పరిశీలన**

సిద్దిపేట- కామారెడ్డి ప్రధాన రహదారి మార్గం లోని లింగన్నపేట-గంభీరావుపేట మధ్యలో మానేరుపై నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన వద్ద తాత్కాలిక రోడ్డు పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. వాహనదారులకు ఇబ్బంది కాకుండా రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గంభీరావుపేటలోని చెరువును పరిశీలించారు.



# రూ.1కే ఆరోగ్య, ప్రమాద బీమా

## మాజీ మేయర్ రవీందర్ సింగ్ ప్రచారం



కరీంనగర్-జనత న్యూస్ : తనను పట్ట భద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రతీ పట్టభద్రునికి రూ.1కే ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించేందుకు కృషి చేస్తానన్నారు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్. కరీంనగర్ లోని పలు ప్రయివేట్ విద్య సంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులను కలిసి ఆయన మద్దతు కోరారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ.. జరగబోయే కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గాల స్థానం నుండి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రుల గొంతుకగా సమస్యల పరిష్కారం కోసం శాసన మండలిలో ప్రశ్నిస్తానని తెలిపారు. తాను మేయర్గా ఉన్న కాలంలో రూపాయికే నల్లా కనెక్షన్, అంత్యక్రియల పథకాన్ని తీసుకొచ్చానని గుర్తు చేశారు. ప్రస్తుతం తనను శాసన మండలికి పంపిస్తే కుటుంబ సభ్యుడిగా సేవలందిస్తానని భరోసా కల్పించారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలో ఉన్న పట్టభద్రులు ఈనెల 30 తారీకు నుండి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు విద్యసంస్థల ప్రతినిధులతో పాటు బిఆర్ఎస్రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేష్, పోన్నం అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

**మాజీ మంత్రిని కలిసిన మాజీ మేయర్**

సిద్దిపేటలో మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్. ఇందులో పలు రాజకీయ అంశాలపై చర్చించారు. హరీష్ రావును కలిసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేష్, పోన్నం అనిల్ గౌడ్ లు ఉన్నారు.

# 317 జీవోలో నష్టపోయిన వారందరికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం

## పి ఆర్ టి యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ రెడ్డి సందీప్



అధ్యక్షులు
ఐరెడ్డి ప్రదీప్ రెడ్డి

ప్రధాన కార్యదర్శి
గుర్రం సందీప్ రెడ్డి

ఇల్లంతకుంట జనతా న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన జీవో 317 లో నష్టపోయిన ప్రతి ఉపాధ్యాయునికి న్యాయం జరిగే వరకు ముందుండి పోరాడుతామని నూతనంగా ఏర్పడిన ఇల్లంతకుంట మండల పిఆర్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐరెడ్డి ప్రదీప్ రెడ్డి గుర్రం సందీప్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదివారం రోజున మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుక్కున్న అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయి పడ్డ ఐదు డిఎ లను వెంటనే మంజూరు చేయాలని అదే మాదిరిగా 317 జీవో ద్వారా ఎక్కడెక్కడికో వెళ్లిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు కేటాయించాలని ప్రమోషన్లలో ఎస్ జి టిలకు జరిగిన అన్యాయాన్ని సరి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూముకుంట మోహన్ రెడ్డి సాంబారెడ్డి ,నాగరాజు, రాజ్ కుమార్, వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పేద ప్రజలకు వరం లాంటిది సీఎం రిలీఫ్ ఫండ్

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఇల్లంతకుంట జనతా న్యూస్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదప్రజలకు వరంలాంటిదని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన పొత్తూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు14లక్షల37వేల ఇన్సూరెన్స్ డబ్బుల చెక్కును అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఇన్సూరెన్స్ కట్టుకుంటే ప్రమాద సమయంలో కుటుంబానికి ఎంతో తోడ్పడుతుందని ఆయన అన్నారు అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలలోని 52 మంది లబ్ధిదారులకు 11 లక్షల 77 వేల ఐదువందల రూపాయల చెక్కులను పంపిణీ చేశాడు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని ప్రజలు అనుకోని సమయంలో అనారోగ్యానికి గురైనట్లయితే వారి వైద్య ఖర్చులకోసం ఇది వారి కుటుంబానికి ఎంతో తోడుగా ఉంటుందని ఆయన అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ గణపతి మండపాల్లోని గణనాథులను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రజ ఆయురారోగ్యాలతో పాడి పంటలతో విలసిల్లాలని ఆయన కోరుకున్నారు నిమజ్జనం సమయంలో నిర్వాహకులు అందరూ తగు జాగ్రత్తలతో నిమజ్జన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వారికి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పార్టీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి మానకొండూరు యువజన సంఘం అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్ మాజి ఎంపీపీ వెంకట రమణారెడ్డి, ఐలయ్య,ఆనందరెడ్డి,అమర్ మంద పెద్ద బాల్ రెడ్డి , ప్రసాద్,రాజేశం,వీరేశం,రాజు తదితరులు పాల్గొన్నారు

# కానిస్టేబుల్ రక్తదానం..

సిద్దిపేట,జనత న్యూస్: సిద్దిపేట పట్టణానికి చెందిన మహిళ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శస్త్ర చికిత్స సమయంలో తోగుట కానిస్టేబుల్ స్వామి శనివారం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటాడు.రక్తదానం చేసిన కానిస్టేబుల్ స్వామికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు



# కాంగ్రెస్ నేత సమ్మన్న ఇక లేరు

**గుండెపోటుతో తుమ్మేటి సమ్మిరెడ్డి హఠాన్మరణం**

**మంత్రి పొన్నంతో పాటు..**

**పలువురు కాంగ్రెస్ నేతల సంతాపం**

**జమ్మికుంటలో సమ్మిరెడ్డికి కన్నీటి వీడ్కోలు**

హుజురాబాద్, సెప్టెంబర్ 14 జనతా న్యూస్: హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి (60) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. జమ్మికుంటలో అయన నివాసంలో గుండెపోటు రాగా వెంటనే.. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమ్మి రెడ్డి మృతి తో జమ్మికుంటతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1980 నుండే.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా నాయకునిగా సమ్మిరెడ్డి ఎదిగారు. ఆయనను అందరూ ప్రేమగా సమ్మన్న అని పిలిచేవారు. ఇక్కడి రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. జమ్మికుంటలో స్థిరపడ్డారు. అందరితో సమన్వయంతో సన్నిహితంగా మెదిలేవారు. ఇక్కడి ప్రజలతో, నాయకులతో మంచి సంబంధాలు కలిగివున్నారు. అజాత శత్రువుగా పేరుతెచ్చుకున్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా రైతుల సమస్యలు పరిష్కరించేందుకు, మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేసారు. ఇక్కడ పార్టీ అధికారంలో లేనప్పటికీ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తూ.. ఇక్కడి పార్టీ శ్రేణులకు పెద్ద దిక్కుగా వ్యవహరించేవారు. కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలిచేవారు. సమ్మిరెడ్డి మృత దేహాన్ని చివరిసారి చూసేందుకు అయన అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అయన పార్థివ దేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అయన చేసిన సేవలు గుర్తు చేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం అయన అంత్యక్రియలు జమ్మికుంటలో జరిగాయి. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పెద్ద ఎత్తున అయన అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

**మంత్రి పొన్నం తో పాటు పలువురి సంతాపం**

తుమ్మేటి సమ్మిరెడ్డి అకాల మృతి పట్ల రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్



బండ శ్రీనివాస్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్, సామజిక వేత్త వర్ధినేని రవీందర్ రావు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, యాప్ టీవీ అధినేత పాడి ఉదయాన%శీ%దన్ రెడ్డి, పత్తి కృష్ణా రెడ్డి, సొల్లు బాబు, సొల్లు దశరథం, తిప్పారపు సంపత్, గూడూరు స్వామి రెడ్డి, సందమల్ల బాబు, బత్తిని రవీందర్ గౌడ్ తదితరులతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సమ్మిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశారని, అధికారంలో ఉన్నా లేకున్నా.. పార్టీ కాపాడుకునేందుకు కృషి చేసారని, రైతుల కోసం కృషి చేసారని పలువురు గుర్తు చేసుకున్నారు.



**తుమ్మేటి ప్రస్థానమిది..**

**నాటి పీపుల్స్ వార్ దళ సభ్యునిగా..**

ప్రస్తుత టేకుమట్ల మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన తుమ్మేటి సమ్మిరెడ్డి జమ్మికుంట కాలేజీ లో చదువుతున్నప్పుడే వామపక్ష రాజకీయాలవైపు ఆకర్షితుడై అప్పటి పీపుల్స్ వార్ గ్రూప్ లోకి వెళ్లి దళ నాయకుడు మాసాని రవీందర్ (భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి నివాసి) దళంలో కొద్దిరోజులు దళ సభ్యునిగా పనిచేసి తదనంతరం జనజీవన స్రవంతిలోకి వచ్చారు.

**ఎన్ ఎస్ యూ ఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ నేతగా..**

**అంచెలంచెలుగా ఎదిగిన సమ్మిరెడ్డి**

పీపుల్స్ వార్ లో పనిచేసిన తదనంతరం రాజకీయాల్లోకి వచ్చిన తుమ్మేటి సమ్మిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి ఎన్ ఐ యు ఐ నేత, యూత్ కాంగ్రెస్ నేతగా క్రియాశీలకంగా పనిచేసారు. పనిచేసారు. అనంతరం కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నాయకునిగా ఎదిగాడు. తరచుగా గాంధీ భవన్ కు వెళ్తూ తన సంబంధాలు విస్తరించుకున్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర స్థాయిలో నేతలు, ముఖ్యమంత్రులు, మంత్రులతో సంబంధాలు కలిగిఉండేవారు. ఐదుగురు పిసిసి అధ్యక్షులతో కలిసి పనిచేసారు. 2004 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా ఇంచార్జ్ గా పనిచేసారు. అప్పటి పి.సి.సి.అధ్యక్షులు డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన పాదయాత్ర సందర్భంగా ఆ యాత్ర విశేషాలను తుమ్మేటి సమ్మిరెడ్డి మీడియాకు అందించారు. వై.ఎస్.పాదయాత్ర అప్పటి హుజురాబాద్, కమలాపూర్ నియోజకవర్గాల్లో కొనసాగినప్పుడు కూడా అయన కీలక భూమిక పోషించి మీడియాను సమన్వయం చేసారు. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి నుండి కమలాపూర్ మండలం శనిగరం వరకు వివిధ గ్రామాల గుండా కొనసాగిన వై.ఎస్.పాదయాత్ర కొనసాగింది. మాజీ పి.సి.సి.అధ్యక్షులు, మాజీ మంత్రి ఎం.సత్యనారాయణరావు (ఎమ్మెస్సార్) కు అత్యంత సన్నిహితంగా సమ్మిరెడ్డి పనిచేసారు. ప్రతిష్టాత్మకమైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా 2004 నుండి 2014 వరకు పనిచేసారు. కాంగ్రెస్ ను వదలి అప్పటి మంత్రి ఈటల రాజేందర్ ఆహ్వానం మేరకు కొంతకాలం బి.ఆర్.ఎస్.పార్టీలో పనిచేసి, తిరిగి 2023 లో కాంగ్రెస్ లో చేరారు.

# సీతారాం ఏచూరికి కొవ్వొత్తుల నివాళ్లు



కరీంనగర్-జనత న్యూస్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు కార్యకర్తలు. కరీంనగర్లో ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తా నుండి తెలంగాణ చౌక్ వరకు కొవ్వొత్తులతో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ..సిపిఎం జాతీయ కార్యదర్శి, ప్రముఖ ఆర్థికవేత్త, మార్క్సిస్టు మహోపాధ్యాయులు సీతారాం ఏచూరి మరణం అత్యంత విచారకరమన్నారు. భారత రాజకీయ వినిలాకాశంలో ఒక అరుణతారను కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఏచూరి చిన్నప్పటినుండే విద్యార్థి ఉద్యమాల లో చురుగ్గా పాల్గొని నాయకత్వం వహించారని, తెలుగు రాష్ట్రాలతో అభినవ సంబంధం ఉందని గుర్తు చేశారు. ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకే కాకుండా భారత దేశ రాజకీయాలకు, పేద ప్రజలకు తీరని లోటని, నిబద్ధత కలిగిన సిద్ధాంతకర్తను కోల్పోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్ జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, నరేష్ పటేల్, నాయకులు భూతం సారంగపాణి, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్, వడ్ల రాజు, రాయి కంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్, కాల్వసురేష్, గాజుల కనకరాజు,చల్ల లక్ష్మణ్, ప్రభాకర్, సందేశ్, ప్రకాష్, డెవిల్కర్ శ్రీకాంత్, కృష్ణ, జనగం రాజమల్లు, విద్యాసాగర్, చారి, రమేష్, పవీణ్, సింహాద్రి, రాజు పాల్గొన్నారు.

# ముగిసిన మండల స్థాయి పోటీలు

**క్రీడల్లో గెలుపోటములు సహజం**

**మాజీ ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి**

**తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో ఖాజామొయినోద్దీన్**

**ప్రతిభ చూపిన వారికి బహుమతులు**



చిగురుమామిడి: చిగురుమామిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీలు ముగిశాయి. విద్యార్థులు పలు క్రీడాపోటీల్లో ప్రతిభ చూపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు అధైర్యపడకుండా మరింత రాణించాలని ఎంఈవో కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో ఖాజా మొయినోద్దీన్ అన్నారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పోటీల్లో రాణించిన విద్యార్థులకు మాజీ ఎంపీపీ కొత్త వినితాశ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి సమ్మయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పావని, విజయలక్ష్మి, జయప్రద, రబియా బస్రి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కిషన్ నాయక్, బాల్ రెడ్డి, చంద్రశేఖర్, ముని ప్రసాద్, లింగారెడ్డి, మల్లేశం, రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు చైతన్య, ఆయా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో మోడల్ స్కూల్ మొదటి స్థానం, జెడ్పీహెచ్ఎస్ బొమ్మనపల్లి ద్వితీయ స్థానం, అండర్-14 విభాగంలో బొమ్మనపల్లి ప్రథమ, విస్డమ్ (బొమ్మనపల్లి) హైస్కూల్ ద్వితీయ, ఖోఖోలో అండర్ -17 విభాగంలో కేజీబీవీ ప్రథమ, బొమ్మనపల్లి ద్వితీయ, అండర్-14 విభాగంలో బొమ్మనపల్లి ప్రథమ, కేజీబీవీ ద్వితీయ, వాలీబాల్ అండర్-17లో మోడల్ స్కూల్ ప్రథమ, కేజీబీవీ ద్వితీయ, అండర్-14లో జెడ్పీహెచ్ఎస్ సుందరగిరి ప్రథమ, మోడల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. సాధించాయి.

కబడ్డీలో అండర్ -17 బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ చిగురుమామిడి ప్రథమ, మోడల్ స్కూల్ ద్వితీయ, అండర్-14 విభాగంలో జెడ్పీహెచ్ఎస్ సుందరగిరి ప్రథమ, డార్విన్ హైస్కూల్ ద్వితీయ, ఖోఖో అండర్-17లో జెడ్పీహెచ్ఎస్ రేకొండ ప్రథమ, విస్డమ్ (బొమ్మనపల్లి) ద్వితీయ, అండర్-14లో జెడ్పీహెచ్ఎస్ బొమ్మనపల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ ఇందుర్తి ద్వితీయ, వాలీబాల్ అండర్-17లో మోడల్ స్కూల్ ప్రథమ, ఇందుర్తి ద్వితీయ, అండర్ - 14లో ఇందుర్తి ప్రథమ స్థానం, సుందరగిరి ద్వితీయ స్థానం సాధించాయి.

అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగుపందెంలో అండర్-14లో అక్షిత (కేజీబీవీ చిగురుమామిడి) ప్రథమ, డి.ప్రసన్న (మోడల్ స్కూల్) ద్వితీయ, అండర్-17లో జి.కావ్య (కేజీబీవీ చిగురుమామిడి) ప్రథమ, ఏం.అక్షయ (కేజీబీవీ చిగురుమామిడి) ద్వితీయ, లాంగ్‌జంప్ అండర్-17లో కె.సమన్విత (జెడ్పీహెచ్ఎస్ బొమ్మనపల్లి) ప్రథమ, ఏ.అనూష (జెడ్పీహెచ్ఎస్ ఇందుర్తి) ద్వితీయ, అండర్-14 విభాగంలో ఎం. వైష్ణవి (కేజీబీవీ చిగురుమామిడి) ప్రథమ, వినీషా (కేజీబీవీ చిగురుమామిడి) ద్వితీయ స్థానంలో నిలిచారు.

# స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు..



కరీంనగర్,జనత న్యూస్: కరీంనగర్ నగరపాలక సంస్థ 32వ డివిజన్ లో అసంపూర్తి రోడ్డు నిర్మాణ మరమ్మతుల పనులను స్థానిక బీజేప నాయకురాలు బండారి గాయత్రి దేవి అధ్వర్యంలో శనివారం మరమ్మతులు చేశారు. డివిజన్లో అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులతో స్థానిక ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా గుంతల మయంగా మారిన అధికారులు ఎలాంటి చర్యలు చేపటకపోవడంతో బండారు గాయత్రి ఆధ్వర్యంలో స్థానిక బిజెపి కార్యకర్తలు స్వచ్ఛందంగా సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిపై ఉన్న గుంతలను కాంక్రీట్ డస్ట్ తో మూసివేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది , అసౌకర్యం తలెత్తకుండా ఉండేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని గాయత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్థానిక నాయకులు కార్యకర్తలు తాడూరి కిరణ్ రెడ్డి, శ్రీనివాస్, వినోద్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులుగా అజయ్



చిగురుమామిడి జనత న్యూస్ : మండలంలోని రేకొండ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న గోదారి అజయ్ తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. శుక్రవారం కరీంనగర్ టీఎన్జీవో భవన్లో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశంలో ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించారు. ఎలక్షన్ అధికారిగా ఎంపీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఎంపీవోలు ఎన్నికలను పర్యవేక్షించారు. ఈ ఎన్నికలలో జిల్లా అధ్యక్షులుగా గోదారి అజయ్ కుమార్, కార్యదర్శిగా భూక్య రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ సుస్మిత రెడ్డి, ట్రెజరీ అబ్దుల్ వహీజ్, ఉపాధ్యక్షులుగా పవన్ సాయి, మధుమిత రెడ్డి, వెంకటేష్, జాయింట్ సెక్రటరీగా రాకేష్, చవన్ లాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి, ఎన్నికలకు సహకరించిన పంచాయతీ కార్యదర్శులకు అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు.

# అధికారుల పేరుతో సైబర్ నేరగాళ్లు..

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచన**


**కొత్త నంబర్స్, ఇంటర్నేషనల్ నంబర్స్ కాల్స్ పట్ల తస్మాత్ జాగ్రత్త**

**సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 పిర్యాదు**

రాజన్న సిరిసిల్ల,జనత న్యూస్: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడి కొట్టించి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులమని,ఇతర శాఖల అధికారులమని సైబర్ నేరగాళ్లు ఏదో ఒక నెంబర్ నుంచి ఫోన్ చేయడం, మీరు లేక మీ కుటుంబ సభ్యులు ఏదో కేసులో ఇరుక్కున్నారని బెదిరించడం,డబ్బులు డిమాండ్ చేయడం, లేక సైబర్ నేరాలకు పాల్పడేందుకు వ్యక్తిగత వివరాలు అడగడం, లేదంటే నెంబర్ బ్లాక్ అవుతుందని దబాయించడం వంటి కేసులు పెరిగిపోయాయిని ఈలాంటి ఫోన్ కాల్స్ కు, గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు, ఫోన్ లకు వచ్చే మెసేజ్ లకు, లింక్ లకు స్పందించవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకోరకంగా మోసాలకు పాల్పడుతున్నారని, ఫేక్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడమే మంచిదని, ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి డ్రగ్స్ పార్శిళ్ల పేరుతో ఫోన్ కాల్స్ కానీ, ఐవీఆర్ కాల్స్ వస్తే వాటికి అసలే స్పందించవద్దన్నారు. వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, డ్రగ్స్ కేసు అని, ఉగ్రవాదులతో సంబంధాలని బెదిరించగానే భయపడి డబ్బులు బదిలీ చేయొద్దని సూచించారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930 ఫోన్ చేయాలని కోరారు. లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

# వెలగని వీధి దీపాలు.. కమ్ముకున్న చీకట్లు

**భయందోళనకు గురవుతున్న గ్రామస్తులు**



గన్నేరువరం-జనత న్యూస్ : కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం లో ని మైలారం గ్రామం ప్రధాన కూడలిలో గతం లో ఏర్పాటు చేసిన హై మ్యాక్స్ లైట్లు కొద్ది రోజులుగా వెలగక పోవడంతో ప్రజలు రాత్రి పూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్‌ల పాలనా కాలంలో ప్రజలు సమస్య చెప్పిన వెంటనే పరిష్కారం అయ్యేదని, ఇప్పుడు ప్రత్యేక అధికారుల పాలన లో సమస్యలు రోజు రోజుకు పేరుకుపోతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో వీధి దీపాలు వెలగక పోవడం తో రోడ్ల వెంట చీకట్లు కమ్ముకున్నాయి. కాలి పోయిన వీధి దీపాల స్థానంలో అధికారులు కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. దీంతో రాత్రి సమయంలో బస్సు దిగి నడుచుకుంటూ వెల్లే గ్రామస్తులు భయాందోళనలకు గురౌతున్నారు. రాత్రి వేళల్లో పాములు, అడవి జంతువులు తిరుగుతున్నాయని, చీకటితో అత్యవసర పనులు కూడా చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. ఇప్పటికయినా ప్రత్యేక అధికారులు స్పందించి లైట్లను మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.